

# శ్రీ పొట్టిశ్రీరాములు నెల్లూరు వార్త


## సోమశిల నీటిమట్టం



**అనంతసాగరం, ఏప్రిల్26, ప్రభాతవార్త:** మండలంలోని సోమశిల జలాశయానికి ఎగువ ప్రాంతాల నుంచి శనివారం సాయంత్రానికి 0 క్యూసెక్కుల వంతున వరద ప్రవాహం నమోదైంది. జలాశయం పూర్తి సామర్థ్యం 78 టీఎంసీలు కాగా ప్రస్తుతం జలాశయంలో 51.486 టీఎంసీల నీరు నిల్వ ఉంది. ఎస్‌ఎఫ్‌సికి 50, ఎస్‌ఎఫ్‌సికి200, పెన్నా డెల్టాకు 30 , కండలేరు వరద కాలువకు 0 క్యూసెక్కుల వంతున నీటిని విడుదల చేస్తున్నారు. ప్రస్తుతం 96.576మీటర్ల మేర నీటిమట్టం నమోదైనట్లు జలాశయం అధికారులు తెలిపారు.

# నేడు ఆత్మీయ సమావేశం, ట్రై సైకిళ్ల పంపిణీ

- దివ్యాంగులకు ట్రై సైకిళ్ల అందజేతకు సర్వం సిద్ధం
- ఆత్మీయ సమావేశానికి తరలిరానున్న కూటమి నాయకులు,

కార్యకర్తలు హాజరు కానున్న ఎంపీ వేమిరెడ్డి, కావలి, ఎమ్మెల్యే వెంకట కృష్ణారెడ్డి, ముఖ్యనేతలు





**నెల్లూరు రూరల్, ఏప్రిల్ 26, ప్రభాతవార్త** కావలి నియోజకవర్గంలో ఉన్న దివ్యాంగులకు భరోసానిస్తూ వివిఆర్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో ఈ నెల 27న ఆదివారం ఎలక్ట్రిక్ ట్రై సైకిళ్ల అందజేత కార్యక్రమానికి అన్ని ఏర్పాట్లు పూర్తయ్యాయి. నియోజకవర్గ వ్యాప్తంగా దాదాపు 160 మందికి ట్రై సైకిళ్లు అందించనుండగా అనంతరం కూటమి నాయకులు, కార్యకర్తలతో ఆత్మీయ సమావేశం నిర్వహించనున్నారు. ఎంపీ వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి ఆధ్వర్యంలో కావలి నియోజకవర్గ ఎమ్మెల్యే దగుమాటి వెంకట కృష్ణారెడ్డి గారి సహకారంతో ఈ కార్యక్రమం జరగనుండగా అందుకు సంబంధించి అన్ని వసతులు కల్పించారు. ట్రై సైకిళ్ల అందజేతకు, ఆత్మీయ సమావేశానికి వేర్వేరుగా వేదికలు ఏర్పాటు చేశారు. కావలి నియోజకవర్గ స్థాయి ఆత్మీయ సమావేశానికి తెలుగుదేశం, జనసేన, బీజేపీ నాయకులు, కార్యకర్తలు భారీ స్థాయిలో తరలిరానున్నారు.



# తీగ లాగితే డొంకంతా కదిలింది

- అంతర్రాష్ట్ర సైబర్ ముఠా గుట్టురట్టు చేసిన నెల్లూరు పోలీసులు
- ఏడుగురు నిందితులు అరెస్ట్



**నెల్లూరు క్రైమ్, ఏప్రిల్ 26, ప్రభాతవార్త :** ఇన్వెస్ట్మెంట్ పేరుతో అదనపు ఆదాయం ఆర్జించమంటూ ఆశ చూపి, ఆన్ లైన్ లో నగదు పెడితే 10 నుండి 15 ఆదాయం సంపాదించవచ్చుని, ట్రేడింగ్ చేసే వారినే లక్ష్యంగా చేసుకొని కొత్త పంథాలో నేరాలకు పాల్పడుతున్న సైబర్ నేరగాళ్ల ఆట కట్టించారు నెల్లూరు చిన్న బజార్ పోలీసులు. ఈ సంఘటనకు సంబంధించిన వివరాలను శనివారం స్థానిక ఉమేష్ చంద్ర సమావేశ మందిరంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో జిల్లా ఎస్పీ జి కృష్ణ కాంత్ వెల్లడించారు. ఆయన తెలిపిన సమాచారం మేరకు.. నెల్లూరుకు చెందిన ఓ మహిళ ఇచ్చిన పిర్యాదు మేరకు కేసు నమోదుచేసి,లోతైన దర్యాప్తు చేపట్టిన పోలీసులకు తీగ లాగితే డొంకంతా కదిలినట్లు తరచూ ఎన్నో సైబర్ నేరా లకు పాల్పడుతున్న అంతర్రాష్ట్ర ముఠా పోలీసుల వలలో చిక్కింది. నకిలీ ఆధార్, పాన్ కార్డులను సృష్టించి, బ్యాంక్ అకౌంట్ లను ఓపెన్ చేసి, సైబర్ నేరాలకు పాల్పడుతున్న ఈ ముఠా ఇప్పటివరకు సుమారు రూ. 2.46కోట్లు బాధితుల నగదు కాజేసినట్లు పోలీసుల దర్యాప్తులో దర్యాప్తులో వెలుగులోకి వచ్చింది.

◆ **కేసు నమోదు:** నెల్లూరు టౌన్ పరిధికి చెందిన మహిళకు, ఇన్వెస్ట్మెంట్ పేరుతో ఎక్కువ ఆదాయం సంపాదించవచ్చని ఆశ చూపి, పలుదపాలుగా జమచేసిన నగదుకు రెట్టింపునగదు చూపిస్తూ 2.46 కోట్లు వేయించుకొని, బాధితురాలు నగదు బదిలీ చేసేందుకు ప్రయత్నించగా, వీలుకాకపోవడంతో మోసపోయానని గ్రహించి, 9వ తేదీ చిన్నబజార్ పోలీసులకు ఫిర్యాదుచేయగా, కేసు నమోదు చేసారు.

◆ **కేసు ఛేధన:** జిల్లా ఎస్పీ జి.కృష్ణకాంత్ ఆదేశాల మేరకు, అడిషనల్ యస్.పి.(అడ్మిన్) సిహెచ్.సౌజన్య సూచనల మేరకు, టౌన్ డిఎస్పి సింధు ప్రియ పర్యవేక్షణలో, చిన్నబజార్ సిఐ చిట్టెం కోటేశ్వరరావు, సైబర్ క్రైమ్ సిఐవెంకటేశ్వర్లు ఆధ్వర్యములో ప్రత్యేక బృందాలుగా ఏర్పడి, సాంకేతిక పరిజ్ఞానాన్ని ఉపయోగించి, ముద్దాయిలను ఈనెల 25వ తేదీ సాయంత్రం సౌత్ నెల్లూరు రైల్వే స్టేషన్ వద్ద అరెస్ట్ చిన్న బజార్ పోలీసులు అరెస్టు చేశారు.

◆ **జరిగిన వృత్తాంతం:** రాజస్థాన్ రాష్ట్రానికి చెందిన గోగారామ్, హేమంత్ కుమార్, కైలాష్, నగరమ్, రామారామ్ లతో పాటు చెన్నైకు చెందిన రామిశెట్టి వీరేశ్వర రావు, ఎం. రవి లు ముఠాగా ఏర్పడి నకిలీఆధార్,పాన్ కార్డులను సృష్టించి, బ్యాంక్ అకౌంట్ లను ఓపెన్ చేసి, సైబర్ నేరాలకు వినియోగిస్తారు. బయోమెట్రిక్ ధృవీకరణ అవసరం లేని రోడ్‌సైడ్ సేల్ పాయింట్ల నుండి డికేవైసీ ద్వారా సిమ్ కార్డులను పొందుతారు. బ్యాంకు అధికారులను సంప్రదించి ఈ నకిలీ పత్రాలను ఉపయోగించి కరెంట్ ఖాతాలను ఓపెన్ చేస్తారు. ఐడిఎఫ్‌సి బ్యాంక్, కర్ణాటక బ్యాంక్, వైఐఎస్ బ్యాంక్, ఇండియన్ ఓవర్సీస్ బ్యాంక్, బ్యాంక్ ఆఫ్ బరోడా, ఐడిబిఐ మొదలైన చిన్న బ్యాంకుల్లో బ్యాంకు అధికారులు ఫీల్డ్ వెరిఫికేషన్ లేకుండా కరెంట్ ఖాతాలను ఓపెన్ చేస్తారు. బ్యాంక్ ఖాతా పాస్ బుక్ లను కొరియర్ ద్వారా రాజస్థాన్ లోని ప్రధాన ముద్దాయికి పంపుతారు. ఎస్ఎంఎస్ ఏపికె ఫైల్ ని ఇన్‌స్టాల్ చేయడం ద్వారా బ్యాంకులింక్ చేయబడిన ఫోన్‌నంబర్‌లను వేర్వేరు మొబైల్ ఫోన్‌లలో ఉంచి, ప్రధాన నిందితులు సులభంగా యాక్సెస్ చేయడానికి అన్నింటినీ ల్యాప్‌టాప్‌కు కనెక్ట్ చేస్తారు. నిందితులందరికీ రూ. 15, 20వేలు జీతం ఇస్తారు. కరెంట్ ఖాతా తెరవడానికి రూ. లక్ష కమిషన్, పొదుపు ఖాతా తెరవడానికి రూ. 20వేలు కమిషన్ పొందుతారు. ముద్దాయిల ద్వారా బ్యాంకు ఖాతాలను సృష్టించిన తర్వాత వారు రాజస్థాన్‌లో ఉంటున్న ప్రధాన నిందితుడైన రామారామ్ కు పాసుబుక్కులను కొరియర్ ద్వారా పంపించి సైబర్ నేరాలకు పాల్పడుతుంటారు. ఈ కేసులో రాజస్థాన్‌కి సంబంధించిన 5 గురు ముద్దాయిలు ఇప్పటి వరకూ 236 బ్యాంక్ అక్కౌంట్స్ ను ఫేక్ ఐడి లతో అక్కౌంట్స్ ఓపెన్ చేసినట్లు, 236 బ్యాంక్ అక్కౌంట్స్‌లో 36 అక్కౌంట్స్ మీద 436 కంప్లైంట్స్ ఎన్‌సిఆర్‌పి పోర్టల్ లో ఉన్నట్లు ఎస్పీ తెలిపారు.

◆ **స్వాధీనపరచుకున్న సొత్తు:** రూ.2 లక్షల నగదు, 29 స్మార్ట్‌ఫోన్‌లు, 21 కీప్యాడ్ ఫోన్‌లు, 57 ఏటిఎం కార్డులు, వైఫై రూటర్, ప్రింటర్, 1 ల్యాప్‌టాప్, కార్డ్ కటింగ్ మెషిన్, లామినేషన్ మెషిన్, పాస్‌బుక్‌లు, సిమ్ కార్డులు, డైరీలు, ఆధార్ కార్డులతో పాటు ముద్దాయిల బ్యాంకు ఖాతాల్లో ఉన్న సుమారు రూ.39 లక్షలు నగదు ఫ్రీజ్ చేయ మని సదరు బ్యాంకులకు లెటర్ పెట్టడం జరిగినట్లు ఎస్పీ తెలిపారు. ఎస్పీ మాట్లాడుతూ ప్రజలు సైబర్ నేరగాళ్ల చేతిలో ఫ్రాడ్ జరిగినట్లు అయితే వెంటనే నిర్భయంగా వచ్చి పోలీసు వారిని ఆశ్రయించాలని, ఆందోళన చెందకుండా సకాలంలో స్పందిస్తే పూర్తి న్యాయం జరుగుతుందని హామీనిచ్చారు. పెయిడ్ టాస్కల ఫ్రాడ్, నకిలీవెబ్ సైట్స్‌లో ఇన్వెస్ట్మెంట్ ఫ్రాడ్, యూట్యూబ్‌లో వీడియోలకు లైక్స్, రివ్యూల ద్వారా అధిక నగదు సంపాదించవచ్చని, ఫేస్‌బుక్, ఇన్ స్టాగ్రాం ద్వారా అపరిచిత వ్యక్తులు స్నేహితులుగా మారి విదేశాలనుండి గిఫ్ట్స్ పంపుతున్నామని నమ్మించి లక్షలు కాజేస్తారని హెచ్చరించారు. అనుమానిత నంబర్స్ నుండి వచ్చే మెసేజ్‌లను ఎట్టి పరిస్థితుల్లో స్పందించవద్దని సూచించారు. సైబర్ నేరానికి గురయ్యామని తెలిసిన వెంటనే మూడు నాలుగు గంటల్లోగా ఫిర్యాదు చేస్తే పోగొట్టుకున్న నగదు రిఫండ్ అయ్యే ఛాన్స్ ఎక్కువగా ఉంటుందన్నారు. ఈ కేసును చేధించుటలో ప్రతిభకనబరిచిన చిన్నబజార్ సిఐ చిట్టెం కోటేశ్వరరావు, సైబర్ క్రైమ్ సిఐ వెంకటేశ్వర్లు, ఎస్ఐ ఎ. అయ్యప్ప,సైబర్ వింగ్ఎస్సై శ్రీనివాసరెడ్డి, ఏఎస్ఐ జి. శ్రీహరి, హెడ్ కానిస్టేబుళ్లు సురేష్ బాబు, నాజ్మల్, పీసీలు ఎం. సుబ్బారావు,శ్యాం,అశోక్ వర్ధన్, ఎస్‌కె రియాజుద్దీన్, ఎస్‌కె.అహమ్మద్, హోం గార్డ్ రామాంజినేయ రెడ్డి, సైబర్ వింగ్ పిసిలు కిషోర్, శ్రీరామ్, కిషోర్‌లను ఎస్పీ అభినందించి రివార్డులు అందజేశారు.

# ఎన్నికల్లో ఇచ్చిన ప్రతి హామీని నెరవేరుస్తాం



**నెల్లూరు, ఏప్రిల్ 26, ప్రభాతవార్త-వైద్యం** నెల్లూరు ప్రజల సమస్యల పరిష్కారం కోసం మనమిత్ర వాట్సాప్ గవర్నెన్స్ తీసుకొచ్చామని రాష్ట్రపురపాలక, పట్టణాభివృద్ధి శాఖ మంత్రి పొంగూరు నారాయణ పేర్కొన్నారు. శనివారం స్థానిక గోమతి నగర్ మంత్రి క్యాంపు కార్యాయలంలో అధికారులు, కార్పొరేటర్లు సచివాలయ సిబ్బంతితో మంత్రి సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ 2014-19 లో రాష్ట్ర వ్యాప్తంగా ఉన్న అన్ని మున్సిపాలిటీలలో పాఠశాలలను పార్కులను సెంట్రల్ డివైడర్లను, 5వేల కోట్ల నిధులు వెచ్చించి అభివృద్ధి చేశామన్నారు. ప్రభుత్వం మారడంతో తమ హయాంలో 90 శాతం పూర్తయిన పనులను సైతం వైసీపీ ప్రభుత్వం పూర్తి చేయలేకపోయిందన్నారు. రాష్ట్రానికి వైసీపీ ప్రభుత్వం పది వేల కోట్ల అప్పులను మిగిల్చి పోయిందన్నారు. ప్రజల చిన్న చిన్న సమసల్య పరిష్కారం కోసంగతంలో ఉన్న పురసేవను మన మిత్రగా మార్చి సేవలందిస్తున్నామన్నారు. మన మిత్రలో సమస్యలను తెలియజేసిన వెంటనే అధికారులు స్పందించి పరిష్కారం చూపుతారని వివరించారు.తాను ఎన్నికల సమయంలో 94 వేల ఇళ్లు తిరిగానని, వారికి ఇచ్చిన హామీల మేరకు ప్రతి ఒక్కటి నెరవేరుస్తానని, నెల్లూరును స్మార్ట్ సిటీగా తీర్చిదిద్దుతామని మంత్రి నారాయణ స్పష్టం చేశారు. వీఆర్ హైస్కూల్ తిరిగి పునరుద్దరించి అత్యంత నిరుపేదలకు నాణ్యమైన ఉచిత విద్యనందిస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో కమిషనర్ వై.ఓ. నందన్ టిడిపి నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు

# రాష్ట్రాన్ని అన్ని విధాల అభివృద్ధి చేస్తాం





**నెల్లూరు,ఏప్రిల్ 26,ప్రభాతవార్త -వైద్యం** నెల్లూరు నగరంలోని 9వ డివిజన్ పరిధిలో రాయపాలెం అంబేద్కర్ పార్కును రాష్ట్ర పురపాలక, పట్టణాభివృద్ధి శాఖ మంత్రి పొంగూరునారాయణ స్థానిక చిన్నారులతో రిబ్బన్ కట్ చేసి ప్రారంభించారు. ఈ సందర్భంగా స్థానిక డివిజన్ కార్పొరేటర్ దామ వరపు రాజశేఖర్ డివిజన్ ఇన్‌ఛార్జ్ కువారపు బాలాజీ స్థానిక ముఖ్యనాయకులు మంత్రి నారాయణకు ఘన స్వాగతం పలికారు. అనంతరం పార్కు ఆవరణలో ఏర్పాటు చేసిన నూతన ఆట వస్తువులను పరిశీలించి చిన్నారులతో కాసేపు ఆటలాడారు.వేసవి సెలవుల్లో పిల్లలందరూ పార్కులో చక్కగా ఆడుకోవాలని, మంత్రి సూచించారు. మంత్రి మీడియాతో మాట్లాడుతూ 9వ డివిజన్లో పార్కు ఏర్పాటు చేయడం చాలా సంతో షంగా ఉందన్నారు. పార్కులో చిన్నారుల కోసం అధునాతన ఆట వస్తువులను ఏర్పాటు చేశారన్నారు. 2014లో తాను మంత్రిగా ఉన్నప్పుడు 103 మున్సిపాలిటీలలో పార్కుల అభివృద్ధితో పాటు సెంట్రల్ డివైడర్లను ఏర్పాటు చేశామని గుర్తు చేశారు. గత ప్రభుత్వం పార్కులను సరిగ్గా మెయింటైన్ చేయక తుప్పు పట్టి మూలనపడ్డాయన్నారు. గత ప్రభుత్వ హయాంలో రాష్ట్రంలో తుగ్లక్ పాలన సాగింది. వైసీపీ ప్రభు త్వం అన్ని వ్యవస్థలను నిర్వీర్యం చేసిందన్నారు. రాజధాని అభివృద్ధి చెందాలంటే పరిశ్రమలు రావాల న్నారు. అమరావతి నిర్మాణం కోసం 50ఏళ్ల దూరదృష్టిలో ముఖ్యమంత్రి చంద్రబాబు ప్రణాళికలు సిద్ధం చేస్తున్నారన్నారు. సీఎం సూచనలతో ఇంటర్నేషనల్ ఎయిర్ ఫోర్ట్స్, స్పోర్ట్స్ సిటీ ఏర్పాటు చేస్తామన్నారు. రానున్న మూడేళ్లలో రాజధానిని పూర్తి చేస్తామన్నారు. ఈ కార్యక్రమంలో కమిషనర్ వై.ఓ. నందన్ టిడిపి నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు

# డ్వాక్రా మహిళలు వ్యాపారస్తులుగా రాణించాలన్నదే సీఎం సంకల్పం



**నెల్లూరు, ఏప్రిల్ 26, ప్రభాతవార్త-వైద్యం** ముఖ్యమంత్రి చంద్రబాబు ఆశయాలకు అనుగుణంగా నెల్లూరులో స్మార్ట్ స్ట్రీట్‌ను ప్రారంభించనున్నామని రాష్ట్ర పురపాలక, పట్టణాభివృద్ధి శాఖ మంత్రి డాక్టర్ పొంగూరు నారాయణ అన్నారు. శనివారం నగర పాలక సంస్థకార్యాలయంలో మెప్మా ఆధ్వర్యంలో ఎంటర్ ప్రెన్యూర్‌షిప్ దవలప్‌మెంట్ ప్రోగ్రాం కింద స్మార్ట్ స్ట్రీట్ వెండార్స్ కు మూడు రోజుల శిక్షనా కార్యక్రమం ముగింపు సభలో మంత్రి నారాయణ పాల్గొన్నారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ మహిళలు సాధారణంగా చేసే చిన్న చిన్న వృత్తులు కాకుడా పెద్దపెద్ద వ్యాపారాలు చేసే స్థాయికి ఎదగాలనేదే తన అభిమతమన్నారు. వ్యాపారం విజయవంతంగా నిర్వహించాలంటే కంప్యూటర్‌పై కనీస అవగాహన ఉండాలన్నారు. అందుకు అవసరమైతే నారాయణ ఇంజనీరింగ్ కళాశాలలో శిక్షణ ఇస్తామని మంత్రి తెలిపారు. మహిళలు ఆర్థికంగా పురోభివృద్ధి సాధించినప్పుడే రాష్ట్రం అభివృద్ధి పథంలో ముందుంటుందని ముఖ్యమంత్రి నమ్మకమన్నారు. గతంలో తాము అధికారంలో ఉన్నప్పుడు డ్వాక్రా, మెప్మా మహిళలకు రూ.2500 కోట్ల విలువ చేసే ఇసుక వ్యాపారాన్ని అందించామని గుర్తు చేశారు. ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీల మేరకు నెల్లూరు నగరంలోని నిరుపేదలను వ్యాపార వేత్తలుగా తీర్చిదిద్దుతామని వెయ్యి మందితో దుకాణాలు ఏర్పాటు చేస్తామన్నారు. ఇందులో భాగంగా మొదటి దశలో 163 మంది వీధి వ్యాపారులను ఎంపిక చేసి వారితో దేశంలో ఎక్కడా లేని విధంగా స్మార్ట్ బజార్లను నిర్వహింపచేస్తున్నామన్నారు. ఈ కార్యక్రమంలో కమిషనర్ వై.ఓ. నందన్ టిడిపి నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు



# మత్స్యకార సేవలో పథకాన్ని లాంఛనంగా ప్రారంభం

- పథకం ద్వారా 12239 మంది మత్స్యకారులు
- మత్స్యకారులకు రూ.24.47 కోట్లు నగదును వారి బ్యాంకు ఖాతాలో జమ

జిల్లా మత్స్యశాఖ జాయింట్ డైరెక్టర్ నాగేశ్వరరావు



నెల్లూరు కలెక్టరేట్, ఏప్రిల్ 26, ప్రభాతవార్త జిల్లాలో మత్స్యకార సేవలో పథకం ద్వారా 12239 మంది మత్స్యకారులకు రూ.24.47 కోట్లు నగదును వారి బ్యాంకు ఖాతాలకు ముఖ్యమంత్రి జమచేసినట్లు జిల్లా మత్స్యశాఖ జాయింట్ డైరెక్టర్ నాగేశ్వరరావు తెలిపారు. శనివారం శ్రీకాకుళం జిల్లా ఎచ్చెర్ల మండలం బుడగట్లపాలెం బీచ్ నుంచి ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు మత్స్యకార సేవలో పథకాన్ని లాంఛనంగా ప్రారంభించారు. ఈ కార్యక్రమాన్ని నెల్లూరు కలెక్టరేట్‌లోని తిక్కన ప్రాంగణం నుంచి మత్స్యశాఖ అధికారులు, మత్స్యకార సంఘ నేతలు, మత్స్యకారులు వర్చువల్‌గా వీక్షించారు. ఈ సందర్భంగా మత్స్యశాఖ జాయింట్ డైరెక్టర్ నాగేశ్వరరావు మాట్లాడుతూ సముద్రంలో వేట సాగించే మత్స్యకారులకు వేటనిషేధ కాలం (ఏప్రిల్ 15 నుంచి 14 జూన్ వరకు) భృతి రూ.20వేలను రాష్ట్ర ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు విడుదల చేశారని చెప్పారు. రెండునెలల వేటనిషేధ కాలంలో మత్స్యకారుల జీవనవిధానం దెబ్బతినకుండా వారికి ఆర్థిక భరోసా కల్పించాలన్నదే ఈ పథకం ప్రధాన ఉద్దేశంగా జెడీ చెప్పారు. జిల్లాలో సముద్రతీర ప్రాంత నియోజకవర్గాలైన కావలి, కోవూరు, సర్వేపల్లి, కందుకూరు నియోజకవర్గాల్లో అర్హులైన మత్స్యకారులకు రూ.20వేలు వారి బ్యాంకు ఖాతాలకు జమ చేస్తున్నట్లు చెప్పారు. కావలిలో 4778 మంది, కోవూరులో 3102 మంది, సర్వేపల్లిలో 1887 మంది, కందుకూరులో 2472మంది మత్స్యకారులకు వేటనిషేధకాల భృతి అందజేస్తున్నట్లు చెప్పారు. మత్స్యకార సంఘనేతలు మాట్లాడుతూ ఎన్నికల్లో ఇచ్చిన హామీ మేరకు గతంలో రూ.10వేలు ఇస్తున్న ఆర్థికసాయాన్ని రెట్టింపు చేసి రూ.20వేలు అందిస్తున్న సీఎం చంద్రబాబుకు ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు. ఇచ్చిన మాట నిలబెట్టుకుని మత్స్యకారులకు అండగా నిలిచిన ముఖ్యమంత్రికి, రాష్ట్రప్రభుత్వానికి తమ మత్స్యకార కుటుంబాలు రుణపడి వుంటాయని ఈ సందర్భంగా వారు తెలిపారు. ఈ కార్యక్రమంలో మత్స్యశాఖ అధికారులు చాన్‌బాషా, శ్రీనివాసులు, మత్స్యకారసంఘ నేతలు కొండూరు పాలిశెట్టి, పామంజి శేషయ్య, కొమారి విజయమ్మ, రామాని నారాయణ, భక్తాని శ్రీను, ఆవల వెంకటరమణ, మత్స్యకారులు పాల్గొన్నారు.

## శనివారం ఆదాయం రూ.9.36లక్షలు



**వలేటివారిపాలెం ఏప్రిల్ 26, ప్రభా తవార్త** మండలంలోని మాలకొండ నందలి శ్రీమాల్యాద్రి లక్ష్మీనరసిం హస్వామి వారిని శనివారం పలువురు భక్తులు దర్శించు కున్నారు. తద్వారా సా ్వమివారికి రూ.9,36,412లు మేర ఆదాయం సమకూరింది.ఆలయ ప్రధాన అర్చకులుగౌరీశంకర్, నరసిం హాచార్యులు భక్తులకు తీర్ధప్రసాదాలు అ ందచేశారు.భక్తుల సం దర్శనతో స్వామివారికి అష్టోత్తర పూజల వలన రూ.6,300 లు, కుంకుమార్చన పూజల ద్వారా రూ.16,280 లు, వివాహాల వలన రూ.2,000లు తలనీలాలు టిక్కెట్లు వలన రూ.55,825లు,వాహనపూజల వలన రూ.3,160లు, ప్రత్యేకదర్శనం రూ.3,51,400లు, స్ధలపురాణం పుస్తక ముల అమ్మకం వలన రూ.280లు,రూముల అద్దెలు రూ. 31,910లు, కవర్లు అమ్మకం వలన రూ.8,700 లు,అన్నదానం నిమిత్తం రూ.2,57, 132లు లడ్డుప్రసాదం అమ్మకాల వలన రూ.2,02,195లు,విరాళాలు వలన రూ.1,230లు చొప్పున స్వామి వారికి భక్తులు సమర్పించారు. ఈ మేరకు ఆలయ డీసీ కె.వి సాగర్ బాబు ఓ ప్రకటనలో పేర్కొన్నారు.

# ముఖ్యమంత్రి ఆత్మకూరు పర్యటన ఏర్పాట్లపై కలెక్టర్, ఎస్పీతో చర్చించిన మంత్రి ఆనం



**నెల్లూరు కలెక్టరేట్, ఏప్రిల్ 26, ప్రభాతవార్త** రాష్ట్ర ముఖ్యమంత్రి శ్రీ నారా చంద్రబాబు నాయుడు ఆత్మకూరు పర్యటనకు పటిష్టమైన ఏర్పాట్లు చేయాలని రాష్ట్ర దేవాదాయశాఖ మంత్రి ఆనం రామనారాయణరెడ్డి కలెక్టర్, ఎస్పీలకు సూచించారు. శనివారం ఉదయం కలెక్టరు క్యాంపు కార్యాలయంలో ముఖ్యమంత్రి ఆత్మకూరు పర్యటన ఏర్పాట్లపై జిల్లా కలెక్టర్ ఆనంద్, ఎస్పీ కృష్ణకాంత్‌తో రాష్ట్ర దేవాదాయశాఖ మంత్రి ఆనం రామనారాయణరెడ్డి సమాలోచనలు చేశారు. ఈ సందర్భంగా మంత్రి ఆనం మాట్లాడుతూ మేనెల 1న సీఎం పర్యటన రూట్‌మ్యాప్, కార్యక్రమాల వివరాలు, బందోబస్తు తదితర అంశాలను ప్రధానంగా చర్చించారు. ఆత్మకూరులో బీసీ రెసిడెన్షియల్ హాస్టల్ వద్ద హెలీప్యాడ్, నారంపేటలో ఎంఎస్ఎంఈ పార్కు ప్రారంభోత్సవం, ఫైలాన్ ఏర్పాటు, మేడే సందర్భంగా నారంపేట ఎంఎస్ఎంఈ పార్కు వద్ద ఆటో కార్మికులు, గృహనిర్మాణ కార్మికులు, ఇతర కార్మికులతో ముఖాముఖి, నెల్లూరుపాలెం ఎస్టీ కాలనీలో పింఛన్ల పంపిణీ, ఆత్మకూరు ఏఎంసి గ్రౌండ్‌లో ప్రజావేదిక, పార్టీ కార్యకర్తల సమావేశం ఏర్పాట్లపై మంత్రి ఆనం చర్చించారు. నారంపేటలోని ఎంఎస్ఎంఈ పార్కు ఫైలాన్ ఆవిష్కరణ, ప్రజావేదిక ఏర్పాట్లను ముఖ్యమంత్రి కార్యాలయ మార్గదర్శకాల మేరకు చేపట్టాలన్నారు. నెల్లూరు పాలెం ఎస్టి కాలనీలో పెన్షన్ల పంపిణీ, యువతతో ముఖాముఖి ఏర్పాటు చేసే అంశాలను పరిశీలించాలన్నారు. శాఖలవారీగా నివేదికలు తయారు చేసి ముఖ్యమంత్రికి అందజేసేందుకు చర్యలు తీసుకోవాలన్నారు. ముఖ్యంగా ఆత్మకూరు అభివృద్ధి, సమస్యలపై ఆయాశాఖల వారీగా సమగ్ర నివేదిక తయారుచేయాలని సూచించారు. శుక్రవారం రాత్రి నెల్లూరు పాలెం సమీపంలోని ఎస్టీ కాలనీని తాను సందర్శించానని, అక్కడ గిరిజనులు ఇళ్ల స్థలాలు లేవని, వర్షం వస్తే ఇల్లు ఊరుస్తున్నాయని తమకు ఇల్లు నిర్మించి ఇవ్వాలని కోరినట్లు చెప్పారు. ఇల్లు నిర్మించి ఇచ్చేందుకు చర్యలు చేపట్టాలని, అలాగే అక్కడే యువతతో కూడా తాను మాట్లాడానని, వారిలో చాలామంది ఆటో డ్రైవర్లు, ట్రాక్టర్ డ్రైవర్లుగా, కూలీలుగా పనిచేస్తున్నారని, ఈ యువతకు స్వయం ఉపాధి పథకాలు అందించేందుకు చర్యలు చేపట్టాలని కలెక్టర్‌కు సూచించారు. సోమశిల జలాశయ మరమ్మతు పనులు, హైలెవల్ కెనాల్, తెలుగుగంగ పనులు, విక్రమసింహపురి యూనివర్శిటీ ద్వారా ఆత్మకూరులో ఇంజనీరింగ్ కళాశాల ఏర్పాటు, సంగం బ్యారేజీ నుంచి జాతీయ రహదారికి అనుసంధానం చేయడం తదితర అంశాలను ముఖ్యమంత్రి దృష్టికి తీసుకెళ్లే విధంగా నివేదికలు రూపొందించాలని కోరారు. సీఎం పర్యటన నేపథ్యంలో హెలీప్యాడ్, డయాస్, బందోబస్తు, పార్కింగ్, రూట్‌మ్యాప్‌పై ఎస్పీతో మంత్రి ప్రత్యేకంగా చర్చించారు. నెల్లూరులో నూతన కలెక్టరేట్ భవనం ఏర్పాటు, అధునాతన అతిథిగృహం, ఆత్మకూరు బీసీ బాలికల రెసిడెన్షియల్ పాఠశాల, ఆదూరుపల్లి రెసిడెన్షియల్ పాఠశాలల ఇంటర్‌మీడియట్ వరకు అప్‌గ్రేడ్, సంగంలో ఐటిఐ ఈ ఏడాది నుంచే ప్రారంభం తదితర అంశాలు కూ డా కలెక్టర్ మంత్రి మధ్య చర్చకు వచ్చాయి. గతంలో నెల్లూరులో అన్ని ప్రభుత్వ కార్యాల యాలన్నీ ఒకేచోట ఉండాలని ప్రణాళిక రూపొందిం చామని, అయితే జిల్లా పరిషత్, ఎస్పీ కార్యాల యం, కార్పొరేషన్ కార్యాలయం తదితర భవనాలు నిర్మించగలిగామని, కలెక్టరేట్ మాత్రం మిగిలిపోయిందని, ఈ ప్రభుత్వంలో నూతన కలెక్టరేట్ నిర్మాణానికి చర్యలు తీసుకుంటామని మంత్రి అన్నారు. దీనికి సంబంధించిన ఒక నోట్‌ను కూడా అందించాలని కలెక్టర్‌ను మంత్రి ఆనం కోరారు.

## సర్వసభ్య సమావేశంలో సమస్యలు ఏకరువు




**సీతారామపురం ఏప్రిల్ 26 ప్రభాతవార్త :** మండలకేంద్రమైన సీతారామపురంలోని స్దానిక మండల పరిషత్ కార్యాలయం నందు నిర్వహించిన మండల సర్వసభ్య సమావేశం ఎంపిపి చింతం రెడ్డి పద్మావతి అధ్యక్షతన జరిగింది. ఈ సమావేశంలో ఎంపిడిఒ ఎం బాస్కర్ అభివృద్ధి నివేదికను చదివి వినిపించారు. అనంతరం ఈ సమావేశంలో ఆయా శాఖ అధికారులు తమ శాఖ పరిధిలోని అభివృద్ధి నివేదికను చదివి వినిపించారు.అనంతరం ఎంపిటిసిలు, సర్పంచులు మాట్లాడుతు ప్రజల సమస్యలను పరిష్కరించేందుకు షుమారు 2 కోట్ల 30 లక్షల ఎంపిపి నిధులతో మండలంలో పలు రకాల అభివృద్ధి పనులను చేపడుతు న్నట్లు చెప్పారు. అందుకు అధికారులు ప్రజా ప్రతినిధులు పూర్తి సహకారం అందించి పనులను త్వరితగతిన పూర్తి చేయాలన్నారు. అలాగే వేసవి నేపద్యంలో త్రాగునీటి ఇబ్బందులు తలెత్తకుండా ప్రత్యేక చర్యలు చేపట్టాలని సూచించారు. ఈ సందర్భంగా బిట్-1 ఎంటిపి పిసి అల్లూరు రాజు మాట్లాడుతు ఉపాధీ హామి పనులలో అవకతవకలు భారీగా జరుగుతున్నాయని క్షేత్రస్దాయిలో ఉపాధీ కూలీలు పనులకు రాకపోయినా వచ్చినట్లు హాజరు వేసి కూలీలకు వచ్చిన సోమ్మును ఫీల్డ్ అసిస్టెంట్లు పంచుకుంటున్నారని తెలిపారు.వాటిని అధికారులు చూసి చూడనట్లు వ్యవహరిస్తున్నారని అన్నారు. ఎన్ని సార్లు సభలో ఈ సమస్య ను గురించి తెలియజేసినా వారిపై చర్యలు తీసుకోవడం లేదన్నారు. ఈకార్యక్రమంలో వైస్ ఎంపిపి చారమ్మ,తహసిల్దారు కృష్ణారెడ్డి, వివిధ గ్రామల సర్పంచ్‌లు,ఎంపిటిసిలు, ఉపసర్పంచ్‌లు, తదితరులు పాల్గోన్నారు.

## ఉగ్రవాద కాల్పులను ఖండిస్తూ కొవ్వొత్తుల నిరసన ప్రదర్శన



**కావలి, ఏప్రిల్26 ప్రభాతవార్త :** జమ్ముకాశ్మీర్ పహల్గామ్ ఉగ్రవాదులు జరిపిన కాల్పుల్లో 28 మంది ప్రాణాలు కోల్పోవడాన్ని తీవ్రంగా ఖండిస్తూ, నిరసిస్తూ సిపిఎం పార్టీ ఆధ్వర్యంలో కొవ్వొత్తుల ప్రదర్శన శనివారం జరిగింది. కావలి పట్టణ మాగుంటపార్వతమ్మ ట్రంకురోడ్డు ఉదయగిరి బ్రిడ్జి సెంటర్ అంబేద్కర్ బొమ్మవద్ద కొవ్వొత్తులతో నిరసన ప్రదర్శన నిర్వహించారు. ఈ సందర్భంగా సిపిఎం పట్టణ కార్యదర్శి పసుపులేటి పెంచలయ్య, పిడియస్‌యు మాజీ రాష్ట్రనేత కరవది భాస్కర్‌లు మాట్లాడారు. ఉగ్రవాదులు జరిపిన కాల్పుల్లో పర్యాటకులు 28 మంది ప్రాణాలు కోల్పోవడం దురదృష్టకరమన్నారు. దీనిని సిపిఎంపార్టీ తీవ్రంగా ఖండిస్తుందన్నారు. ఈ కాల్పుల్లో కావలి పట్టణానికి చెందిన మధుసూదన్ చనిపోవడం చాలా బాధాకరమైన విషయమన్నారు. భారతకేంద్రప్రభుత్వం ఉగ్రవాద దాడులను అణిచివేసే చర్యలు చేపట్టాలని డిమాండ్ చేశారు. కాల్పులకు పాల్పడిన ఉగ్రవాదులను కఠినంగా శిక్షించాలన్నారు. మరలా ఇలాంటి సంఘటన పునరావృతం కాకుండా ప్రభుత్వాలు చర్యలు చేపట్టాలని డిమాండ్ చేశారు. ఉగ్రవాదులు చేతుల్లో చంపబడ్డవారి కుటుంబాలకు కేంద్ర, రాష్ట్రప్రభుత్వాలు అండగా ఉండాలని కోరారు. ఈ కార్యక్రమంలో సిపిఎం పార్టీ నాయకులు వై.కృష్ణమోహన్, బి.రమణయ్య, ప్రజాసంఘాల నాయకులు మధు, పి.వెంకటేశ్వర్లు, మేడా వెంకటేశ్వర్లు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## డాక్టర్ ఉమాచంద్ వైద్యశాలలో రక్తదాన శిబిరం

## రక్తదానం చేసిన 44 మంది రక్తదాతలు



**కావలి, ఏప్రిల్26 ప్రభాతవార్త :** వేసవికాలంలో రక్తనిల్వల కొరతను నివారించేందుకు తమవైద్యశాల సిబ్బంది రక్తదానానికి ముందుకు రావడం ఎంతైనా అభినందనీయమని డాక్టర్ ఉమాచంద్ తెలిపారు. కావలి పట్టణంలోని డాక్టర్ ఉమాచంద్ వైద్యశాలలో శనివారం రక్తదాన శిబిరాన్ని నిర్వహించారు. డాక్టర్ ఉమాచంద్ రక్తదానం చేసి శిబిరాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. వేసవిలో అన్ని రక్తకేంద్రాలలో రక్తం కొరత ఏర్పడుతుందన్నారు. విద్యాసంస్థలకు శెలవులు, ఇతర కారణాలవల్ల రక్తకొరత ఏర్పడుతుందన్నారు. అందువల్ల తలసేమియా బాధిత చిన్నారులతోపాటు ప్రసవించే తల్లులు, రోడ్డుప్రమాద బాధితులు ఇబ్బందులకు గురౌతారన్నారు. ఆ రక్తకొరతను నివారించేందుకు తమ వైద్యశాల ముందుకువచ్చి రక్తదాన శిబిరాన్ని నిర్వహించడం జరిగిందన్నారు. ఈ కార్యక్రమంలో కావలి రెడ్‌క్రాస్ ఉపాధ్యక్షులు, ఐఎంఎ గౌరవ సలహాదారులు డాక్టర్ బెజవాడ రవికుమార్ మాట్లాడారు. కావలి రెడ్‌క్రాస్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న తలసేమియా ఆసుపత్రిలో దాదాపు ప్రతిరోజూ రక్తలేమితో ఉన్న చిన్నారులకు ఉచితంగా వైద్యుల పర్యవేక్షణలో రక్తం ఎక్కిస్తున్నామన్నారు. కావలి ఇండియన్ మెడికల్ అసోసియేషన్ (ఐఎంఎ) సహకారంతో వివిధ ప్రైవేటు ఆసుపత్రుల నిర్వాహకులు రక్తదాన శిబిరాలు నిర్వహిస్తున్నారని తెలిపారు. వేసవి తాపాన్ని సైతం లెక్కచేయకుండా రక్తకేంద్రాల్లో రక్తకొరతను నివారించేందుకు ముందుకు వస్తున్న రక్తదాతలను ఆయన ప్రత్యేకంగా అభినందించారు. ఈ శిబిరంలో 44 మంది రక్తదానం చేశారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ ఉమాచంద్ వైద్యశాల వైద్యులు డాక్టర్ ఫయాజ్, పిఆర్‌ఓ వేణుగోపాల్‌రెడ్డి, కావలి రెడ్‌క్రాస్ ఛైర్మన్ దాకారపు రవిప్రకాష్, వైస్‌ఛైర్మన్ కె.హరినారపరెడ్డి, కోశాధికారి ఆరికట్ల మధుసూధన్‌రావు, రెడ్‌క్రాస్ సిబ్బంది పాల్గొన్నారు.

## జెండాదిబ్బలో 2 వేలు టిడిపి సభ్యత్వ నమోదు



**సంగం ఏప్రిల్ 26 ప్రభాతవార్త :** దేవాదాయ శాఖమంతి ఆదేశాలతో టిడిపి సభ్యత్వ నమోదుకు విశేషస్పందన లభించిందని టిడిపినాయకులు నెల్లూరు పెంచలయ్య తెలిపారు. జెండా దిబ్బ ,అరవపాళెంలో మొత్తం 2 వేల సభ్యత్వాలు జెండాదిబ్బ గ్రామ నాయకులు చేయించినట్లు ఆయన తెలిపారు .ముఖ్య మంత్రి చంద్రబాబునాయుడు, మంత్రి లోకేష్ టిడిపిలో సభ్యత్వం ఉన్న వారిని అదుకుంటున్న తీరు చూసి ప్రజలు విశేషంగా పార్టీలో చేరుతున్నారని ఆయన పేర్కున్నారు. ఇలాంటి కార్యక్రమం భారతదేశంలో ఏపార్టీ చేయలేదని ఆయన ప్రశంసించారు. శనివారం జెండా దిబ్బ గ్రామంలో పభ్యత నమోదు చేసుకున్నవారికి సభ్యత్వ కార్డులు పంపీణి చేయడం జరిగిందని ఆయన పేర్కున్నారు.ఈకార్యక్రమంలో టిడిపినాయకులు గువ్వాడి వేణుబాలు,సూరా పాయపాళెం పవన్‌కుమార్,తాళ్లూరు కిషోర్, ఫయాజ్ సన్నావుల్లా, పఠాన్ ఫయాజ్, గువ్వాడి చంద్రశేఖర్, పతకమూరి నరసింహరావు, తదితరులు పాల్గోన్నారు.

## అనంతసాగరం నుండి ఉగ్రదాడి నిరసనకు తరలిన నాయకులు

**అనంతసాగరం,ఏప్రిల్26,ప్రభాతవార్త:** ఆత్మకూరులో శుక్రవారం రాత్రి కాశ్మీర్‌లో ని పెహల్గాంలో జరిగిన ఉగ్రవాదుల దాడికి నిరసనగా ఆత్మకూరు నియోజకవర్గ మాజీ శాసనసభ్యుడు మేకపాటి విక్రమ్‌రెడ్డి ఆదేశాల మేరకు ఆత్మకూరు వైఎస్ఆర్ కాంగ్రెస్‌పార్టీ నాయకులు నిరసన ప్రదర్శన, ఉగ్రవాదుల దాడిలో ప్రాణాలు కోల్పోయిన వారి ఆత్మకు శాంతికలగాలని కొవ్వొత్తులతో నివాళి కార్యక్రమానికి అనంతసాగరం మండలం వైసిపి మండల కన్వీనర్ బిజివేముల పిచ్చిరెడ్డి ఆధ్వర్యంలో నాయకులు, కార్యకర్తలు తరలి వెళ్ళారు. ఈసందర్భంగా వైసిపి కన్వీనర్ మాట్లాడుతూ ఆత్మకూరులోని మున్సిపల్ బస్టాండ్‌నుంచి నల్లబ్యాడ్జీ లతో నిరసన తెలుపుతూ ఉగ్రవాదులు నశించాలని ర్యాలీ నిర్వహించామన్నారు. ఆనందంగా గడుపుతున్న పర్యాటకులపై విచక్షణారహితంగా కాల్పులు జరిపి 28మంది ప్రాణాలను పొట్టన పెట్టుకున్నారని అలాంటి వారిని కేంద్ర ప్రభుత్వం కఠినంగా శిక్షించాలని ఆయన కోరారు. ఈకార్యక్రమంలో మండల వైసిపి నాయకులు పాల్గొన్నారు.

## ఉగ్రవాద దాడులను ఖండించిన శేషం సుదర్శన్

**అనంతసాగరం,ఏప్రిల్26,ప్రభాతవార్త:** పాకిస్తాన్ ఉగ్రవాదుల అరాచక చర్యలు మితిమీరుతున్నాయని, అమయకుల్ని బలితీసుకున్న ముష్కరులను తరిమికొట్టాల్సిన అవసరం ఉందని జిల్లా విజిలెన్స్ అండ్‌మానిటరింగ్ కమిటీ మాజీ సభ్యులు శేషం సుదర్శన్ పేర్కొన్నారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ పాకిస్తానీ ఉగ్రవాదుల చర్యల దురదృష్టకర సంఘటన భారతదేశంలోని ప్రజలను ఒక్కసారిగా భయాందోళనలతో ఉలిక్కిపడేలా చేసిందన్నారు. ఇలాంటి దురద ృష్టకర సంఘటనలు మళ్ళీ పునరావృతం కాకుండా యావత్‌భారతదేశ ప్రజలంతా ముక్తకంఠంతో ఖండించాల్సిన అవసరం ఎంతైనా ఉందన్నారు. పాకిస్తాన్ ఉగ్రవాదుల దురాగత చర్యలపై భారత ప్రధాని నరేంద్రమోడి కఠినచర్యలు తీసుకునేందుకు ఆదేశాలు జారీచేయడం శుభపరిణామమన్నారు. ఇప్పటికైనా సాకిస్తాన్ ఉగ్రవాదుల అరాచక చర్యలకు తగిన రీతిలో బుద్ధి చెప్పేందుకు ప్రజల మనోభావాలు దెబ్బతినకుండా కాపాడుకునేందుకు కులమత జాతి ప్రాంత వర్ణ వర్గ విభేదాలు లేకుండా భారతీయులంతా ఏకతాటిపైకి రావాల్సిన అవసరం ఎంతైనా ఉందన్నారు.

## అమాయక ప్రజలపై కాల్పులు జరపడం దారుణం



**ఉలవపాడు, ఏప్రిల్ 26, ప్రభాతవార్త :** జమ్మూకాశ్మీర్‌లో అన్యం పుణ్యం తెలియని అమాయక ప్రజలను ఉగ్రవాదులు అతి కిరాతకంగా హత్య చేయడం దారుణమని 139 బీసీ కులాల జేఏసీ రాష్ట్ర చైర్మన్ మిరియం శ్రీనివాసులు ఒక ప్రకటనలో తెలిపారు. కేంద్ర ప్రభుత్వం హత్యలకు పాల్పడిన ఉగ్రవాదుల పట్ల కఠినంగా వ్యవహరించాలని వారికి సహకరించిన దేశం ఏదైనా సరే తగిన విధంగా గుణపాఠం చెప్పాలని శ్రీనివాసులు తెలిపారు. ఉగ్రవాదులను పట్టుకుని బహిరంగంగా ప్రజల సమక్షంలో శిక్షించే విధంగా కేంద్ర ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని తెలిపారు. కంప్యూటర్ యుగంలో కూడా హిందువులు అనగానే హత్యలు చేయటం ఉగ్రవాదులకు తగదని అన్నారు. మనిషి అనే వాడు ఏ మతస్థుడైనా సరే ప్రాణం ఒకటే కదా అని శ్రీనివాసులు అన్నారు. కేంద్ర ప్రభుత్వం ఉగ్రవాదుల పట్ల కఠినంగా వ్యవహరించకపోతే రానున్న రోజుల్లో ప్రజలు తీవ్ర ఆందోళనకు గురవుతారని అలాంటి భయాన్ని పోగొట్టే విధంగా కేంద్రం చర్యలు తీసుకోవాలని శ్రీనివాసులు తెలిపారు.

## ఏఎస్‌పేట లాడ్జీలో దుకాణాలను తనిఖీ చేసిన సిఐ



**అనుసముద్రంపేట, ఏప్రిల్26,ప్రభాతవార్త:** మండల కేంద్రమైన ఏఎస్‌పేటలో శనివారం జిల్లా ఎస్పీ ఆదేశాల మేరకు సంగం సిఐ కె.వేమారెడ్డి స్థానిక పోలీస్ సిబ్బందితో లాడ్జీలను (అద్దె గదులు), దుకాణాలను పరిశీలించారు. లాడ్జీలను పరిశీలించి అద్దె గదుల్లో ఉన్న వారి వివరాలను తెలుసుకొని లాడ్జీలోని రికార్డులను పరిశీలించారు. ఎవరు ఎక్కడి నుండి వచ్చారు. ఎన్నిరోజుల కొరకు వచ్చారు, ఎందుకు వచ్చారు అనే పూర్తి వివరాలను అడిగి తెలుసుకున్నారు. ఎవరికంటే వారికి రూములు అద్దెకు ఇవ్వరాదని అద్దె రూముల కొరకు వచ్చిన వారి ఆధార్ కార్డు పూర్తి వివరాలను ఖచ్చితంగా తీసుకొని రూములు ఇవ్వాలని పోలీసులు లాడ్జీల నిర్వాహకులకు సూచించారు. నేర చరిత్రలున్న ఇతర వ్యవహారాల్లో సంబంధలు పెట్టుకొని తలదాచుకోవడానికి దర్గా అని వచ్చిన వారికి రూములను ఇవ్వరాదన్నారు. ఎరవైనా అనుమానాస్పదంగా కనిపిస్తే పోలీసులకు సమాచారం అందించాలన్నారు. ప్రస్తుతం దేశంలో నెలకొన్న పరిస్థితుల దృష్ట్యా ఉన్నతాధికారులు ఆదేశాల మేరకు పోలీసులు తనిఖీ లు ముమ్మరం చేశామన్నారు. దుకాణాదారులు, షాప్ యజమానులు పంచాయతీ లైసెన్సు లు తప్పనిసరిగా కలిగి ఉండాలన్నారు. లాడ్జీల నిర్వాహకులు ఎవరికంటే వారికి రూములు ఇచ్చి వివరాలు సేకరించకుండా అలసత్వం వహిస్తే అలాంటి లాడ్జీల నిర్వాహకులపై చట్టపరమైన చర్యలు తీసుకొని కేసులు నమోదు చేస్తామన్నారు. ఇలాంటి వ్యవహారాల్లో ప్రజలు పోలీసులకు సహకరించాలన్నారు. ఈకార్యక్రమంలో సర్పంచ్ షేక్ జిలానీబాషా, ఎఎస్ఐ భాస్కర్‌రెడ్డి, హెడ్‌కానిస్టేబుల్ మధుసూధన్‌రావ్, కానిస్టేబుల్స్ వెంకటేశ్వర్లు, షబ్బీర్ ఇతర సిబ్బంది పాల్గొన్నారు.

## స్పౌజీ పింఛన్ల కోసం దరఖాస్తులు



**ఉదయగిరి, ఏప్రిల్ 26, ప్రభాతవార్త :** ఉదయగిరి మండలంలో స్పౌజీ పింఛన్ల కోసం అర్హులైన వారు దరఖాస్తు చేసుకోవాలని ఎంపీడీఓ అప్పాజీ శనివారం తెలిపారు. 2023 డిసెంబర్ 1 నుంచి 2024 అక్టోబర్ 31 తేదీ వరకు పింఛను తీసుకుంటూ మరనించిన కుటుంబ యజమాని స్థానంలో వారి భార్యకు వితంతు పింఛను మంజూరు చేస్తామన్నారు. ఈనెల 29వ తేదీ లోపు తగిన దృవపత్రాలతో గ్రామ సచివాలయాలలో దరఖాస్తులు దాఖలు చేసుకోవాలన్నారు. ఈ విషయాన్ని మండల ప్రజలు గమణించాలన్నారు.

## వరి విత్తనాలు కొనుగోలులో జాగ్రత్తలు వహించండి



**అల్లూరు,ఏప్రిల్ 26,ప్రభాతవార్త:** అల్లూరు మండలంలోని రైతాంగం రెండో పంట వేసేందుకు సిద్ధం అవ్వడంతో వరి విత్తనాలు కొనుగోలులో రైతులు తీసుకోవలసిన జాగ్రత్తలను కావలి డివిజన్ వ్యవసాయ అధికారి నాగరాజు ప్రకటన ద్వారా తెలియ చేస్తూ రైతులు లైసెన్సు లు కలిగిన వరి వ్యాపారస్తుల వద్ద మాత్రమే వరి విత్తనాలను కొనుగోలు చేయాలని కొనుగోలు చేసినప్పుడు రసీదులు తీసుకోవాలని విత్తనాలను మడి కట్టి పరిశీలించుకోని తదుపరి నారుమడులలో వరి విత్తనాలు వేసుకునే విధంగా జాగ్రత్తలు తీసుకోవాలని లైసెన్సు లు లేకుండా వరి విత్తనాలు విక్రయించే వారిపై చర్యలు చేపట్టడం జరుగుతుందని ఆయన తెలిపారు

## కోనలో వైభవంగా పెనుశిల లక్ష్మీనృసింహుని కళ్యాణోత్సవం



**పెంచలకోన(రాపూరు),ఏప్రిల్26ప్రభాతవార్త :** ప్రముఖ పుణ్యక్షేత్రమైన పెంచలకోనలో శనివారం శ్రీ పెనుశిల లక్ష్మీనరసింహ స్వామి వారి కళ్యాణం వైభవంగా నిర్వహించారు. ఇందులో బాగంగా తెల్లవారుజామున 4.30కి స్వామి వారి మూలమూర్తికి అభిషేకంగోపూజ, పూలాంగి సేవ నిర్వహించారు. ఉదయం 9.30కి స్వామి వారి ఆస్థాన మండపంలో స్వామి వారికి ఉభయ దేవేరులైన ఆదిలక్ష్మీ,చెంచులక్ష్మీ అమ్మవార్లతో వేదపండితులు,వేద మంత్రోచ్ఛరణలతో కళ్యాణం శాస్త్రోక్తంగా నిర్వహించారు.సాయంత్రం స్వామి,అమ్మవార్లను తిరుచ్చిపై వుంచి తిరుచ్చిఉత్సవం నిర్వహించారు. తదుపరి స్వామి అమ్మవార్లకు సహస్ర దీపాలంకరణ మండపంలో ఊంజల్ సేవ నిర్వహించారు. పెద్ద ఎత్తున భక్తులు ఈ కార్యక్రమాలలో పాల్గొని స్వామి,అమ్మవార్లను దర్శించుకోని పూజలు నిర్వహించారు. పెద్ద ఎత్తున వచ్చిన భక్తులకు కావలసిన భోజన,వసతి ఏర్పాట్లను ఆలయ ఉప కమీషనర్ పోరెడ్డి శ్రీనివాసుల రెడ్డి ఆధ్వర్యంలో సినియర్ సహాయకుడు పాలవల్లి లక్ష్మీ నారాయణ, ఎఇ వినోద్, సిబ్బంది నరసింహా, వెంకటసుబ్బయ్య, తదితరులు పర్యవేక్షించారు.స్వామి వారి పూజా కార్యక్రమాలను శాస్త్రోక్తంగా ఆలయ ప్రధానార్చకులు రామయ్య స్వామి, పెంచలయ్య స్వామి, అర్చక స్వాములు గుండ్లూరు శశి స్వామి, మధు స్వామి, వర్ధన్ స్వామి, వెంకట బాలజీ స్వామి, వినోద్ స్వామి, నాగరాజు స్వామి, సాయి స్వామి తదితరులు నిర్వహించారు.

## అగ్ని ప్రమాదమా? భయం లేదు... మేమున్నాం..!

**– జాయింట్ మాక్ డ్రిల్ నిర్వహించిన ఎస్ఈఐఎల్ ఎనర్జీ, అదానీ కృష్ణపట్నం పోర్ట్, ఏపి జెన్‌కో**



**ముత్తుకూరు, ఏప్రిల్ 26, ప్రభాతవార్త:** జాతీయ అగ్నిమాపక సేవ పక్షోత్సవాల సందర్భంగా, భారతదేశంలోని అతిపెద్ద స్వతంత్ర విద్యుత్ ఉత్పత్తిదారులలో ఒకటైన ఎస్ఈఐఎల్ ఎనర్జీ ఇండియా లిమిటెడ్ శనివారం ఉమ్మడి అత్యవసర ప్రతిస్పందన డ్రిల్‌ను నిర్వహించింది. బొగ్గు ఫీడర్లలో ఒక పెద్ద అగ్ని ప్రమాదం జరిగినప్పుడు ఎలా స్పందించాలో డ్రిల్ ద్వారా ప్రదర్శించారు. కాల్ అందిన వెంటనే ఎస్ఈఐఎల్ ఎనర్జీ ఇండియా లిమిటెడ్, అదానీ కృష్ణపట్నం పోర్ట్, ఏపి జెన్‌కో ప్లాంట్ నుండి అగ్నిమాపక సిబ్బంది సంఘటనా స్థలానికి చేరుకుని, వారి ఫైర్ టెండర్లను ఉపయోగించి ఉమ్మడి అగ్నిమాపక చర్య చేపట్టారు. చివర్లో, ఒక వివరణాత్మక సెషన్ నిర్వహించబడింది. అగ్ని సురక్షిత భారత దేశం కోసం ఏకమవుదాం అనే థీమ్‌తో ఈ ఏడాది కార్యక్రమాలు జరుగుచున్నాయి. డ్రిల్‌లో మూడు కంపనీలకు చెందిన అగ్నిమాపక సిబ్బంది పాల్గొన్నారు.

## పరమేశ్వరుని ఆలయంలో అభిషేకాలు



**ఉదయగిరి, ఏప్రిల్ 26, ప్రభాతవార్త :** ఉదయగిరి మండల పరిధిలోని గండిపాలెం జలాశయం ఆవరణంలో ఉన్న శ్రీ పరమేశ్వరుని ఆలయంలో శనివారం త్రయోదశి సందర్భంగా శనివారం అర్చకులు భక్తులు విశేష పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా స్వామివారికి పంచామృత అభిషేకాలు, అష్టోత్తర శతనామావళి పూజలు ప్రత్యేక అలంకరణలు నిర్వహించారు. భక్తులు స్వామివారిని దర్శించుకుని మొక్కులు తీసుకున్నారు. అనంతరం తీర్థ ప్రసాదాలు స్వీకరించారు.

## ఎంపిటిసిల ప్రమేయం లేకుండా పనులు చేపడితే ఎలా?



**బిట్రగుంట ఏప్రిల్ 26(ప్రభాతవార్త ):**మండల ప్రాదేశిక నియోజకవర్గం లో సభ్యుల ప్రమేయం లేకుండా కనీస సమాచారం లేకుండా పనులు చేపట్టడం ఏమిటని మండల మీట్లో ఎంపీటీసీ సభ్యులు ఏకే సుందర్రాజు ప్రశ్నించారు.బోగోలు మండల సర్వసభ్య సమావేశం శనివారం ఎంపీపీ మేకల సుజాత అధ్యక్షతన జరిగింది.ఈ సమావేశంలో సుందర్ రాజు మాట్లాడుతూ ఇప్పటివరకు మండలంలో ఎంపీటీసీల ప్రాదేశిక నియోజకవర్గం జరిగిన పనుల వివరాల జాబితా ఇవ్వాలని అధికారులు కోరారు.చెత్త నుండి సంపద తయారీ కేంద్రాలు గ్రామపంచాయతీలో పంచాయతీ నిధుల నుండి తిరిగి వాటిని పునరుద్ధరిస్తే ఇప్పటివరకు చేపట్టిన పనులను ఏఈఆర్డబ్ల్యూఎస్,ఏఈ పంచాయతీరాజ్ ఎవరు కూడాచేపట్టిన పనులను ఎంబుక్ లో నమోదు చేయలేదని దీనిపై చర్యలు తీసుకోవాలని కోరారు. ఇంకా సమావేశంలో సభ్యుల పలు సమస్యలపై అధికారులు ప్రశ్నించి సమాధానాలు రాబట్టారు.అంతకుముందుసమావేశం లో ఇటీవల ఎబి కండ్రిక ఎంపిటిసి సాధనల మాధవ పాముకాటుతో అకాల మృతి చెందటంతో సమావేశం లో రెండు నిముషాలు మోనం పాటించి తమ ప్రగాఢ సానుభూతి తెలియజేసారు. ఈ సమావేశంలో జడ్పిటిసి మద్దిబోయిన కీర్తన, మండల పరిషత్ ఉపాధ్యక్షుడు మాధవరెడ్డి, ఎండిఓ సుబ్రహ్మణ్యం, తాసిల్దార్ సురేష్ కుమార్, వివిధ శాఖల అధికారులు, పంచాయతీ కార్యదర్శులు, ఎంపీటీసీ సభ్యులు పాల్గొన్నారు.

## కండలేరులో 45.504 టీయంసీల నీటిమట్టం



**రాపూరు,ఏప్రిల్26ప్రభాతవార్త :** మండలంలోని కండలేరు జళాశయంలో శనివారం ఉదయం నాటికి జళాశయంలో 45. 504 టీయంసీల నిటిమట్టం నమెదు అయినట్లు కండలేరు ఎఇ తిరుమలయ్య తెలిపారు. జళాశయం నుండి హెడ్ రెగ్యులేటర్ ద్వారా 345 క్యూసెక్కులు, లో లేవల్ స్ల్యూయిస్ ద్వారా 50 క్యూసెక్కులు, హైలెవల్ కెనాల్ ద్వారా 30 క్యూసెక్కుల చోప్పున మొత్తం 425 క్యూసెక్కులు అవుట్ ఫ్లోగా వెలుతున్నట్లు ఆయన తెలిపారు.

## మధుసూధన్ కుటుంబానికి ఎల్‌ఐసి డెత్ క్లెయిమ్ చెక్ అందచేత



**కావలి, ఏప్రిల్26 ప్రభాతవార్త :** ఉగ్రదాడిలో అశువులుబాసిన కావలివాసి సోమిశెట్టి మధు సూధన్ కుటుంబానికి జీవితభీమా సంస్థ (ఎల్‌ఐసి) క్లెయిమ్ చెక్కును అందచేశారు. మధుసూధన్ కావలి ఎల్‌ఐసిలో జీవన్‌శ్రీ పాలసీ తీసుకున్నారు. ఈ పాలసీకి సంబంధించి 10,74,920 లక్షల రూపాయల చెక్కును మధుసూధన్ కుటుంబానికి అందచేశారు. ఈ సందర్భంగా నెల్లూరు డివిజన్ మార్కెటింగ్ మేనేజర్ రామకృష్ణయ్య మాట్లాడారు. మధుసూధన్ నామిని అయిన తండ్రి తిరుపాలుకు ఈ చెక్కును అందచేయడం జరిగిందన్నారు. డెత్ సర్టిఫికెట్ వగైరాలు లేకుండా కేవలం న్యూస్ ఛానల్స్, న్యూస్ పేపర్స్ ఆధారంగా ఈ క్లెయిమ్‌ను సెటిల్‌మెంట్ చేయడం జరిగిందన్నారు. ఈ కార్యక్రమంలో ఎల్‌ఐసి నెల్లూరు డివిజన్ అధికారులు జి.ప్రసాదరావు, ఎస్.ఫయాజ్ అహ్మద్, ఎల్‌ఐసి కావలిశాఖ సీనియర్ బ్రాంచ్ మేనేజర్ ఎ.బాలాజీబాబు, అడ్మినిస్ట్రేటివ్ ఆఫీసర్ ఎం.శ్రీనివాసరావు, అసిస్టెంట్ బ్రాంచ్ మేనేజర్ డి.భాస్కర్‌రావు, ఎల్‌ఐసి ఉద్యోగులు పాల్గొన్నారు. జనసేన నేత వెంకటసుబ్బయ్య, తదితరులు ఉన్నారు.

## బాల్య వివాహాలు ప్రోత్సహించకండి

**– జిల్లా స్త్రీ, శిశు సంరక్షణ సాధికారిత అధికారి సువర్ణ**




**ముత్తుకూరు, ఏప్రిల్ 26, ప్రభాతవార్త :** బాల్య వివాహాలు ప్రోత్సహించకండని జిల్లా స్త్రీ, శిశు సంరక్షణ సాధికారిత అధికారి ఎస్. సువర్ణ పేర్కొన్నారు. శనివారం మండల సమైక్య కార్యాలయం నందు మహిళా శిశు సంక్షేమశాఖ ఆధ్వర్యంలో జిల్లా స్త్రీ, శిశు సంరక్షణ సాధికారిత అధికారిని ఎస్. సువర్ణ ఆదేశాల ప్రకారం విఏఓలు, అంగన్వాడి కార్యకర్తలకు అవగాహన కార్యక్రమాలు నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అధ్యక్షులుగా ఎంపిడిఓ పి.నాగమణి వహించగా కార్యక్రమంలో జిల్లా బాలల సంరక్షణ అధికారి బి.సురేష్ మాట్లాడుతూ బాలల చట్టాలు, నూతనంగా బాలల చట్టాలలో వచ్చిన మార్పులు గురించి శిక్షలు గురించి, చైల్డ్ హెల్ప్ లైన్ నెంబర్ 1098 ఉమెన్ హెల్ప్ లైన్ నెంబర్ 181, 112 సైబర్ క్రైమ్, చైల్డ్ మ్యారేజ్ ప్రొహిబిషన్ యాక్ట్ గురించి వివరించారు. అక్షయ తృతీయ సందర్భంగా బాల్య వివాహాలు ఎక్కువగా దేవాలయాల్లో నిర్వహించే అవకాశం ఉన్నందున ప్రతి ఒక్కరు బాల్య వివాహాల పై ప్రత్యేక దృష్టి పెట్టే ఎక్కడ బాల్యవివాహాలు జరిగే అవకాశాలు ఉన్నాయే తెలుసుకొని వారికి కౌన్సెలింగ్ ఇచ్చి బాల్యవివాహాల వలన కలిగే నష్టాలను వాటిని అరికట్టుటకు అందరు తీసుకోవలసిన చర్యలు గురించి బాల్య వివాహాలు జరిపించిన వారిపై ఎటువంటి చట్టాలు వర్తింపజేస్తారు వారికి పడే శిక్షలు గురించి, జరిమానాల గురించి వివరించారు. అనంతరం లైంగిక వేధింపుల నుండి ఏ విధంగా రక్షణ కలిగించుకోవాలి. పోక్సో చట్టము గురించి, గుడ్ టచ్ బాడ్ టచ్ గురించి అందరికి అవగాహన కల్పించడం జరిగింది. మిషన్ వస్త్యల్య పథకం ద్వారా వచ్చే స్పాన్సర్షిప్‌లకు 4000 రూపాయిలు అనేది నిస్సహాయ స్థితిలో ఉన్న బాలలకు వైద్యం, విద్యకు ఏవిధముగా ఉపయోగ పడుతుంది. దత్తత గురించి తీసుకోవాలంటే ఆన్లైన్లో ఎలా నమోదు చేసుకోవాలి చట్టవ్యతిరేక దత్తత వలన కలిగే నష్టాలు గురించి తెలియజేశారు. సిడిపిఓ ఎం.రాజ్యలక్ష్మి, ఐసీడీఎస్ ద్వారా 0 -6 సంవత్సరాల పిల్లలకు సేవలతో పాటు గర్భిణీ, బాలింతలకు సేవల్లో జాప్యం లేకుండా పనిచేస్తున్నామన్నారు. అందరికి మా సేవలు అందిస్తున్నామని మహిళల భద్రతే లక్ష్యంగా తాము పనిచేస్తున్నట్లు తెలిపారు. గృహహింస ద్వారా, సఖి (వన్ స్టాప్ సెంటర్) ద్వారా జిల్లాస్థాయిలో మహిళల భద్రత కు మహిళా చట్టాల అమలకు కృషి చేస్తున్నామని, వీటి పట్ల అందరూ అవగాహన కల్గి అందరూ మా సేవలను పొందేలా చూసుకోవాలి అని మన జిల్లాలో మహిళలకు కానీ శిశువులకు కాని ఎటువంటి ఇబ్బందులు లేకుండా చూడడమే మనందరి బాధ్యత అని తెలియజేశారు. ఈ కార్యక్రమంలో ఏపిఎం నిర్మల, ఓఎస్‌సి కౌన్సిలర్ కమల, అంగన్వాడీ టీచర్లు, సంఘ బంధాల అధ్యక్షురాలు, తదితరులు పాల్గొన్నారు.

## ఉదయగిరి వాసి చేజర్ల సుబ్బారెడ్డికి కీలక పదవి



**ఉదయగిరి, ఏప్రిల్ 26, ప్రభాతవార్త :** ఉదయగిరి వాసికి కీలక పదవి లభించింది. రాష్ట్ర వైఎస్సార్‌సీపీ స్టేట్ పబ్లిసిటి వింగ్ వైస్ ప్రెసిడెంట్‌గా ఉదయగిరి మండల వైసీపీ నాయకుడు చేజర్ల సుబ్బారెడ్డిని నియమించారు. మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఆదేశాల మేరకు కేంద్ర కార్యాలయం నుంచి శనివారం ఉత్తర్వులు వెలువడ్డాయి. తనపై ఎంతో నమ్మకం ఉంచి ఇంత పెద్ద బాధ్యతలు అప్పగించిన జగన్‌మోహన్‌రెడ్డి నమ్మకాన్ని నిలబెట్టుకుంటానని చేజర్ల సుబ్బారెడ్డి అన్నారు. అనంతరం ఈ సందర్భంగా ఉదయగిరి వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ గానుపెంట ఓబుల్‌రెడ్డి శాలువాతో సన్మానం చేశారు. పలువురు నాయకులు ఆయనను ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో మండల కన్వీనర్ గానుపంట ఓబుల్‌రెడ్డి దాసరపల్లి సర్పంచ్ గౌస్ మొహిద్దిన్, అక్కి భాస్కర్‌రెడ్డి,ఎంపీటీసీ తిరుపతయ్య, మాజీ వైస్ ఎంపీపీ శ్రీనివాసులు, వెంగళరావు నగర్ సర్పంచ్ తిరుపతయ్య, దిలీప్ గురవయ్య, వెంకట రమణయ్య, ఉప్పుటూరి హరి, ఎండీ రియాజ్, హాజరత్, చినబాల వైసీపీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు పాల్గొన్నారు.

## డ్రోన్ కెమెరాలతో నిఘా పటిష్టం

**– ఎస్సై వీరేంద్రబాబు**



**తోటపల్లిగూడూరు, ఏప్రిల్ 26, ప్రభాతవార్త :** తోటపల్లిగూడూరు మండలంలో డ్రోన్ కెమో రాలతో నిఘా పటిష్టం చేస్తున్నట్లు తోటపలి ్లగూడూరు ఎస్సై వీరేంద్రబాబు తెలిపారు. తోటపల్లిగూడూరు మండలంలోని చింతోపు పంచాయతీలోని గ్రామాలలో శనివారం ఎస్సై వీరేంద్రబాబు ఆధ్వర్యంలో తమ సిబ్బందితో కలిసి డ్రోన్ కెమెరాలతో చుట్టు పక్కల ప్రాంతాలను క్షుణ్ణంగా పరిశీలించారు. నెల్లూరు జిల్లా ఎస్పీ ఆదేశాలతో రూరల్ డీఎస్పీ ఆధ్వర్యంలో ముత్తుకూరు సీఐ పర్యవేక్షణలో డ్రోన్ కెమెరాలతో తోటపల్లిగూడూరు మండలంలో నిఘా పటిష్టం చేసినట్లు ఎస్సై వీరేంద్రబాబు తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈ డ్రోన్ కెమెరాల ద్వారా తోటపల్లిగూడూరు మండలం మొత్తం పోలీసు పర్యవేక్షణలో నడుస్తుందని బహిరంగ ప్రదేశాలలో మద్యం సేవించిన ఎవరైనా అనుమానస్పదంగా కనిపించిన అలాగే ఎవరైనా అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడిన అలాంటి వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని ఎస్సై వీరేంద్రబాబు తెలిపారు. అలాగే రాత్రి వేళల్లో పని లేకుండా రోడ్లపై సంచరిస్తున్న అలాంటి వారిపై తక్షణం చర్యలు తీసుకునేందుకు వెనుకాడబోమని ఆయన ప్రజలను హెచ్చరించారు. అలాగే మద్యం సేవించి ఎవరైనా గొడవలకు పాల్పడిన వారిపై కఠిన చర్యలు ఉంటాయని ఆయన మందుబాబులను హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో ఎస్సై వీరేంద్రబాబుతో పాటు శరత్‌బాబు, హజరత్ అయ్యా, పవన్ కుమార్, గోపాల్ పాల్గొన్నారు.

## ఉగ్ర దాడులలో మరణించిన వారికి యంఆర్‌పిఎస్ నివాళి



**తూమాయిరోడ్డు(రాపూరు),ఏప్రిల్26ప్రభాతవార్త :** కాశ్మీర్‌లోని పహల్గాంలో ఉగ్రవాదుల దాడులలో మృతి చెందిన వారి ఆత్మశాంతి కోసం యంఆర్‌పిఎస్ వ్యవస్థాపక అధ్యక్షుడు మందకృష్ణ మాదిగ ఆదేశాల మేరకు రాపూరు ,కలువాయి, సైదాపురం మండలాల యంఆర్‌పిఎస్ ఇన్‌చార్జ్ చింతగుంట అంకయ్య ఆధ్వర్యంలో తూమాయి రోడ్డు వద్ద కోవ్వోత్తులతో వారి మృతికి నివాళుల ర్పించారు.డాక్టర్ బిఆర్ అంబేద్కర్, బాబు జగ్జీవన్ రామ్ విగ్రహాల వద్ద కోవ్వోత్తులు వెలిగించి నివాళులర్పించారు.ఈ సందర్భంగా అంకయ్య మాట్లాడుతూ ఉగ్రవాదులు హిందువులను టార్గెట్ చేసి దారుణంగా కాల్చిచంపడాన్ని ఖండించారు. ప్రతి ఒక్కరు ఉగ్రవాదానికి వ్యతిరేకంగా పోరాడాలని ఆయన కోరారు. ఈ కార్యక్రమంలో పలువురు యంఆర్‌పిఎస్ కార్యకర్తలు పాల్గోన్నారు.

## నేడు రాపూరులో విద్యుత్ సరఫరాకు అంతరాయం

**రాపూరు,ఏప్రిల్26ప్రభాతవార్త :** రాపూరు విద్యుత్ సబ్ స్టేషన్ పరిధిలో ఆదివారం ఉదయం 7 గంటల నుండి 10.30 వరకు విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు సబ్ స్టేషన్ సబ్ ఇంజనీర్ కార్తిక్ తెలిపారు.సబ్ స్టేషన్ పరిధిలోని రాపూరు,తెగచర్ల, సిద్దవరం,వేపినాపి, కొమ్మిపాడు ఎక్స్‌ప్రెస్ ఫ్లీడర్‌లలో ఏమర్జెన్సీ మెయింట్‌నెన్స్ సందర్భంగా ఈ కోతలు విధిస్తున్నట్లు తెలిపారు. విద్యుత్ వినియోగదారులు ఇందుకు సహకరించాలని ఆయన కోరారు.

## వివాహ వార్షికోత్సవం సందర్భంగా రక్తదానం



**కావలిరూరల్, ఏప్రిల్26 ప్రభాతవార్త** కావలి హ్యాపీ స్వచ్ఛందసేవాసంస్థలో క్రియాశీలక సభ్యులు మారుబోయిన నాగరాజు, నీలిమల 22వ వివాహవార్షి కోత్సవం సందర్భంగా కావలి రెడ్‌క్రాస్ భవ నం నందు శనివారం మారుబోయిన నాగరాజు 19వ సారి స్వచ్ఛందంగా రక్తదానం చేయడం జరిగింది. నాగరాజుకు ప్రియ మిత్రులు, హ్యాపీసేవాసంస్థ ఉపాధ్యక్షులు దేవరకొండ విజయ్ 12వ సారి స్వచ్ఛందంగా రక్తదానం చేయడం జరిగింది. ఈ సందర్భంగా హ్యాపీసేవాసంస్థ గౌరవ అద్యక్షులు షేక్.బాషా, అధ్యక్షులు సయ్యద్ ఘనీబాషాలు మాట్లాడారు. ఈ రోజు మా సంస్థలో ముఖ్యమైన సేవాతత్పరులు మారుబోయిన నాగరాజు, నీలిమ వివాహదినోత్సవం సందర్భంగా రక్తదానం చేయడం చాలా సంతోషంగా ఉందని తెలియచేశారు. ఆ దపంతులకు మా సంస్థ ద్వారా వివాహవార్షికోత్సవ శుభాకాంక్షలు తెలియచేస్తున్నా మన్నారు. దేవరకొండ విజయ్ ఎంతో ఉత్సాహంగా ముందుకు వచ్చి మిత్రునికి సంఘీభావంగా రక్తదానం చేయడం చాలా ఆనందంగా ఉందని తెలియచేశారు. మాకు అన్ని విధాలా సహకరించిన రెడ్‌క్రాస్ నిర్వాహకులకు ధన్యవాదాలు తెలియచేశారు. ఈ కార్యక్రమంలో జాగో సేవాసంస్థ అద్యక్షులు షేక్.జమీర్, పూలచానా, భరత్‌కుమార్, స్టాఫ్‌నర్స్ జె.శేషమ్మ, తదితరులు పాల్గొన్నారు.

## ఐదుగురు పేకాటరాయుళ్ల అరెస్ట్

**కావలిరూరల్, ఏప్రిల్26 ప్రభాతవార్త** కావలిరూరల్ పోలీసుస్టేషన్ సర్కిల్ ఇన్స్‌పెక్టర్ జి.రాజేశ్వరరావు ఉత్తర్వుల మేరకు కావలి రూరల్ ఎస్ఐ తిరుమలరెడ్డి వారి సిబ్బందితో కలిసి శనివారం కావలి మున్సిపాలిటి పరిధిలోని బాలకృష్ణారెడ్డినగర్ శివారు ప్రాంతంలో లోపలబయట పేకాట ఆడుతుండగా వారిపై దాడిచేసి ఐదుమంది వ్యక్తులను పట్టుకుని వారి వద్దనుండి 1650 రూపాయలు నగదు స్వాధీనం చేసుకుని కేసు నమోదుచేయడం జరిగింది. ఎక్కడైనా గ్రామాల్లో పేకాట, కోడిపందేలు ఆడుతున్నట్లు, గంజాయి అమ్ముతున్నట్లు సమాచారం ఉన్నచో వెంటనే తెలియచేయాలని సర్కిల్ ఇన్స్‌పెక్టర్ జి.రాజేశ్వరరావు తెలియచేశారు.

## సోమిరెడ్డి సహకారంతో చెత్త బుట్టలు పంపిణీ



**తోటపల్లిగూడూరు, ఏప్రిల్ 26, ప్రభాతవార్త** మండలంలోని వెంకన్నపాలెం గ్రా మంలో ఎస్సీ ఎస్టీ కాలనీలకు సో మిరెడ్డి చంద్రమోహన్‌రెడ్డి సహ కారంతో స్థానిక తెలుగుదేశం పార్టీ నాయకులు చింత సీతారామయ్య ఆధ్వర్యంలో ఎస్సీ, ఎస్టీ మహిళలకు చెత్త బుట్టలు పంపిణీ చేశారు. మాట్లాడు తూ గ్రామాలు పరిశుభ్రంగా ఉండాలంటే చెత్త వీధులలో వేయకుండా బుట్టలలో వేసి ఇళ్ల దగ్గరకు చెత్త బండ్లు వస్తే వాటిలో వేయాలని ఆయన మహిళలకు సూచించారు. అలాగే చెత్తను వీధులలో వేయడం వల్ల గ్రామాలలో అంటు వ్యాధులు ప్రబలే ప్రమాదం ఉంటుందని అందుకే ప్రభుత్వం ప్రత్యేకించి ఎస్సీ, ఎస్టీ కాలనీలలో చెత్తబుట్టలు ఇంటింటికి అందించే కార్యక్రమం చేపట్టిందని ఆయన గుర్తు చేశారు. అలాగే గ్రా మాలలో వీదులలో ఎక్కడంటే అక్కడ చెత్త వేయకుండా గ్రామ కూడలిలో ఏర్పాటు చేసిన చెత్తకుండీలలోనే చెత్త వేయాలని ఆయన మహిళలకు సూచించారు. వెంకన్నపాలెం పంచాయతీ సెక్రటరీ స్థానిక నాయకులు, మహిళలు తదితరులు పాల్గొన్నారు.

## వైభవంగా పల్లకి సేవ



**కోవూరు, ఏప్రిల్ 26 ప్రభాతవార్త** : కోవూ రులోని గాంధీపార్కు సెంటర్‌లో వెలసి ఉన్న శ్రీ కోదండ రామ స్వామి దేవస్థానంలో చైత్ర మాసశనివారం పర్వదినం సందర్భంగా ప్రాత: కాలమునే స్వామి వారికి ఆలయ ప్రధాన అర్చ కులు శ్రీకాంతాచార్యుల ఆధ్వర్యంలో అభిషేక పూజలను సాంప్రదాయబద్ధంగా భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. పల్లకి సేవ కార్యక్రమం కన్ను ల పండువగా చేపట్టారు. మాజీ సీడీసీ చైర్మన్ జక్కంరెడ్డి కృష్ణారెడ్డి , భక్తులు ఉన్నారు.

## మహిళా చట్టాలపై అవగాహన



**వింజమూరు, ఏప్రిల్ 26, ప్రభాతవార్త** మ హిళా చట్టాలపైన ప్రతి మహిళ అవ గాహన కలిగి ఉండాలని వింజ మూరు ఐ సీడీఎస్ సీడీపీఓ సీహెచ్ పద్మజా కుమారి పేర్కొన్నారు. శనివారం వింజమూ రులోని వెలుగు కార్యాలయంలో వెలుగు, ఐసీడీఎస్ సంయుక్తంగా మండల సమాఖ్య సమావేశం నిర్వహించారు. ఈ సమావేశానికి స్త్రీ నిధి ఏజీఎం కామాక్ష య్య వెలుగు ఏపీఎం కృష్ణారావు స్త్రీ నిధి అధ్యక్షురాలు మేరీ, ఐసీడీఎస్ సీడీపీఓ పద్మజ అధ్యక్షతన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా వెలుగు స్వయం సహాయక సభ్యులకు స్త్రీ నిధి ద్వారా అందే రుణాలు చెల్లించాల్సి న విధానాలు తదితర విషయాలపై అవగాహన కల్పించారు. తమ జీవనోపాధిని పెంపొందించుకునేందుకు స్త్రీనిధి ద్వారా రుణాలను పొంది సకాలంలో చెల్లించి తమ జీవనోపాధిని పెంపొందించుకోవాలని తెలిపారు. అలాగే సాధా రణంగా జరిగే సమీక్ష సమావేశం ద్వారా వెలుగు అభివృద్ధి కార్యక్రమాలను సమీక్షించారు. అనంతరం సీడీపీఓ పద్మజాకు మారి మాట్లాడుతూ ఫోక్సో చట్టం చైల్డ్ హెల్ప్ లైన్ ఉమెన్ చట్టాలు ఉమెన్ హెల్ప్ లైన్ బాల్య వివాహాలు నియంత్రణ చట్టం, మ్యారేజీ రిజిస్ట్రేషన్ చట్టం గురించి కిషోర్ వికాసం గురించి తెలియ జేశారు. అలాగే కిషోర్ వికాసం వేసవి ప్రత్యేక కార్యక్రమం 2వ తేదీ నుంచి జూన్ 1వ తేదీ వరకు వారానికి రెండు రోజులు అంగన్‌వాడీ కేంద్రాల్లో నిర్వహించాలని తెలియజేశారు. బాల్య వివాహాలను అరికట్టుటకు తీసుకో వాల్సి న చర్యలనుగురించి అవగాహన కల్పిం చారు.ఎంఎంఎస్ ప్రెసిడెంట్ హరిత, కార్యదర్శి మహేశ్వరి, ఐసీడీఎస్ సూపర్‌వైజర్ ఎస్‌కే షకీలా, సీసీలు, సునీత, సుశీల, విజయలక్ష్మీ, స్వయం సహాయక సభ్యులు ఉన్నారు.

## అంగన్‌వాడీ కేంద్రాలను మరింత ఆదర్శవంతంగా తీర్చిదిద్దాలి



**కోవూరు, ఏప్రిల్ 26 ప్రభాతవార్త :** కోవూరు ఐసీడీఎస్ ప్రాజెక్టు పరిధిలోని నాలుగు మండలాల్లో ఉన్న అంగ న్‌వాడీ కేంద్రాలను మరింత ఆదర్శ వంతంగా తీర్చిదిద్దేలా అంగన్‌వాడీ కార్యకర్తలు ప్రత్యేక దృష్టి సారించాలని ఐసీడీఎస్ సీడీపీవో జ్యోతి అన్నారు. కోవూరులోని ఐసీడీఎస్ ప్రాజెక్టు కార్యాలయంలో మంగళవారం ఇట ీవల ప్రభుత్వం ద్వారా వచ్చిన వివిధ పరికరాలను, వస్తువులను అంగన్ వాడీ కార్యకర్తలకు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఇటీవల అంగన్‌వాడీ కార్యకర్తలకు ప్రీ ప్రైమరీ పాంశాలపై శిక్షణ ఇవ్వడం జరిగిందని, దానిని పూర్తిస్థాయిలో ఆకళింపు చేసుకుని పాఠశాలలో అమలు చేసేలా తగు చొరవ తీసుకోవాలన్నారు. ప్రస్తుతం ప్రతి అంగన్‌వాడీ కేంద్రం పరిధిలో గర్భవతులకు, బాలింతలకు పూర్తిస్థాయిలో అవగాహన కల్పించేలా ప్రత్యేక దృష్టి పెట్టాలన్నారు. ఈ కార్యక్రమంలో సూపర్‌వైజర్ లక్ష్మీప్రసన్న, అంగన్‌వాడీ కార్యకర్తలు ఉన్నారు.

## మృతుల కుటుంబాలకు సంఘీభావంగా క్యాండిల్స్ ర్యాలీ



**కోవూరు, ఏప్రిల్ 26 ప్రభా తవార్త :** ప్రజా సంఘాలు, రాష్ట్ర కమిటీ పిలుపు మేరకు కాశ్మీర్‌లోని పెహల్గమ్ దాడిలో మృతిచెందిన కుటుంబాలకు సంఘీభావంగా శనివారం సాయంత్రం కోవూరు పురవీధుల్లో యూటీఎఫ్, జన విజ్ఞాన వేదిక, సీఐటీయూ, ఆవాజ్ కమిటీ ఆధ్వర్యంలో కొవ్వొత్తుల ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా పలువురు నేతలుమాట్లాడుతూ మతోన్మాదుల పిరికి పందల చర్యను తీవ్రంగాఖండిస్తు న్నామన్నారు. ఇటువంటి దుశ్చర్యలకు పాల్పడడం మంచి పద్దతి కాదన్నారు. భారతదేశ వ్యాప్తంగా ఈ ఘటనపై పెద్దఎత్తున సంఘీభావం ర్యాలీలు నిర్వహిస్తున్నారన్నారు. ఈ పెహల్గమ్ దాడిలో మృతిచెందిన కుటుంబాలకు తమ సానుభూతి కూడాతెలియజేస్తున్నామన్నారు. పెద్దఎత్తున నేతలు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## ఉగ్రవాద దుశ్చర్యలను ప్రతి ఒక్కరూ ఖండించాలి



**కోవూరు, ఏప్రిల్ 26 ప్రభాతవార్త** : కోవూరు మండలం పడుగుపాడు పంచాయతీ పరిధిలోని పడుగు పాడు పార్క్ డెవలప్‌మెంట్ కమిటీ ఆధ్వర్యంలో శనివారం ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా కమిటీ అధ్యక్షులు కృష్ణారెడ్డి, కార్యదర్శి జీవీఎస్ ప్రసాద్‌లు మాట్లాడుతూ పహల్గమ్ దుర్ఘటనలో ప్రాణాలు కోల్పోయిన సాటి భారతీయులకు ప్రతి ఒక్కరూ అంజలి ఘటించాల్సి న అవసరం ఉందన్నారు. ఇటువంటి దుశ్చర్యకు పాల్పడిన ప్రతి ఒక్కరిని చట్టపరంగా శిక్షించాల్సి న అవసరం ఉందన్నారు. సాటి మానవుడు అని చూడకుండా కర్కశంగా ఇటువంటి దుశ్చర్యలకు పాల్పడిన వారిని ప్రతి ఒక్కరూ ముక్త కంఠంతో ఖండించాలన్నారు. భారతీయులను అతి కిరాతకంగా చంపిన ఈ ఘటనతో యావద్దేశాలన్నీ భారతదేశానికి అండగా నిలిచేందుకు ఏకతాటిపై వస్తున్నాయన్నారు. తీవ్రవాదుల దాడిలో మృతిచెందిన వారికి ఈ సందర్భంగా సంతాపం తెలియజేస్తూ ఈ ర్యాలీ చేపట్టడం జరిగిందన్నారు. ఈ కార్యక్రమంలో కమిటీ ఉపాధ్యక్షుడు డాక్టర్ ఏ. నాగరాజు, కోశాధికారి రాధాకృష్ణారెడ్డి, ఉపాధ్యక్షుడు రమణయ్య, జాయింట్ సెక్రటరీ ఎండీ హనీఫ్, సభ్యులు పాల్గొన్నారు.

## పీజీఆర్ఎస్ ఫిర్యాదులపై ప్రత్యేక దృష్టి సారించాలి



**కోవూరు, ఏప్రిల్ 26 ప్రభాతవార్త :** కోవూరు మండలంలోని అన్ని గ్రామాలకు సంబంధించి పీజీఆర్ఎస్ ద్వారా వచ్చే అర్జీలపై సంబంధిత గ్రామ రెవెన్యూ అధికారులు ప్రత్యేక దృష్టి సారించాలని తహసీల్దార్ నిర్మలానందబాబా అన్నారు. కోవూరు మండలం పాటూరు పంచాయతీకి సంబంధించి పీజీఆర్ఎస్‌లో నమోదైన కాలువనీటి పరిష్కారంపై శనివారం తహసీల్దార్ ఆ ప్రాంతానికి వెళ్లి దానిని పరిష్కరించేలా తగు చొరవ తీసుకున్నారు. మాట్లాడుతూ ప్రతి వీఆర్‌వో వారి వారి పరిధిలో వచ్చిన పీజీఆర్ఎస్ ఫిర్యాదులను క్షుణ్ణంగాపరిశీలించి వాటిని సకాలంలో పరిష్కరించేలా చూడాలన్నారు.

## ఉగ్రవాదం వద్దు.. శాంతి ముద్దు



**కోవూరు, ఏప్రిల్ 26 ప్రభాతవార్త :** కోవూరు మండలం గంగవరం గ్రామంలోని గీతాంజలి ఇంజనీరింగ్ కళాశాలలో శనివారం కళాశాల విద్యార్థులు, అధ్యాపకులు సిబ్బందిచే పెహల్గామ్ ఉగ్రదాడికి వ్యతిరేకంగా నిరసన ర్యాలీ చేపట్టారు. ఈ సందర్భంగా కళాశాల డైరెక్టర్ డాక్టర్ జి. సుబ్బారావు మాట్లాడుతూ ఇటువంటి ఉగ్రవాద కార్యకలాపాలు మత పరమైన ఉద్రిక్తతలు సృష్టిస్తాయని పేర్కొన్నారు. భారతదేశం ఆది నుంచి శాంతి , అహింసలు బోధించి ప్రపంచ దేశాలకు ఆదర్శప్రాయంగా నిలిచిందన్నారు. ప్రజలంతా శాంతి సామరస్యాలతో జీవనం సాగిస్తూ కలిసికట్టుగా ఉగ్రవాద దుశ్చర్యలను ఎదుర్కోవాలని పిలుపునిచ్చారు. ప్రిన్సిపాల్ డాక్టర్ కె. సందీప్‌కుమార్ మాట్లాడుతూ అమానుషంగా ఉగ్రవాద తూటాలకు బలి అయిన సందర్శకుల ఆత్మలకు శాంతిచేకూరాలన్నారు. భారతదేశం జాతీయ సమైఖ్యతను స మగ్రతలను పరిరక్షించడానికి విద్యార్థులంతా జాతీయ స్ఫూర్తితో ప్రతిజ్ఞ చేయాలన్నారు. బాధిత కుటుంబాలకు సంఘీభావాన్ని సంతాపాన్ని ప్రకటిస్తూ 5 నిమిషాల పాటు మౌనం పాటించారు. ఈ కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపాల్ డాక్టర్ కె. శ్రావణ్‌కుమార్, వివిధ శాఖల విభాగాధిపతులు డాక్టర్ పెంచల్‌రెడ్డి, డాక్టర్ పి. రవికు మార్, డాక్టర్ పి.బాబు, పి. చక్రపాణి, కళాశాల ఎన్ఎస్ఎస్ ప్రోగ్రామ్ అధికారి వై. మురళీకృష్ణ, ఉన్నారు.

## ఈ వేసవి సమయంలో బిడ్డల పట్ల ప్రత్యేక జాగ్రత్తలు తీసుకోవాలి



**కోవూరు, ఏప్రిల్ 26 ప్రభాతవార్త :** ప్రస్తుతం వేసవి సెలవులుకావడంతో అన్ని పాఠశాలలకు, కళాశాలలకు సెలవులు ఇవ్వడం జరిగిందని, తమ బిడ్డలు ఈత కొట్టేందుకు చెరువులు, కాలువలు దగ్గరకు వెళ్ల కుండా తల్లిదండ్రులు తగు జాగ్రత్తలు తీసుకోవాలని కోవూరు సీఐవి. సుధాకర్‌రెడ్డి తెలిపారు. కోవూరులోని సర్కిల్ కార్యాలయంలో శనివారం ఆయన మాట్లాడుతూ ముఖ్యంగా తల్లిదండ్రులు తమ మైనర్ పిల్లలకు మోటార్ వాహనాలను ఇవ్వకూడదన్నారు. ఒకవేళ వారు వాహనాలు నడిపే సమయంలో ఏమైనా ప్రమాదాలు జరిగితే ఆ బాధ్యతను తండ్రులే వహించాల్సి వస్తుందన్నారు. దీనిని దృష్టిలో పెట్టుకుని తమ బిడ్డలకు మైనర్ తీరిన తర్వాత లైసెన్స్ పొంది అనంతరమే వారికి వాహనాలు ఇవ్వాలని తెలిపారు. ముఖ్యంగా ఇటీవల కాలంలో యువతచెడు అలవాట్లకు బానిసలై రాత్రి వేళల్లో ద్విచక్ర వాహనాలు నడుపుతున్నారని, దీని వలన జరగరాని ప్రమాదం జరిగితే వారితో పాటు పక్కవారు కూడా ఇబ్బందులు పడే పరిస్థితి వస్తుందన్నారు. అదేవిధంగా ఈ వేసవి సెలవుల్లో యాత్రలకు, వివాహాది శుభకార్యాలకు వేరే ప్రాం తాలకు వెళ్లేవారు సంబంధిత పోలీస్ స్టేషన్‌కు సమాచారం అందించాన్నారు. ముఖ్యంగా ఆండ్రాయిడ్ ఫోన్ ఉన్న ప్రతి ఒక్కరూ ఎల్‌హెచ్ఎంఎస్ లాక్ మోనిటరింగ్ సిస్టమ్‌ను డౌన్‌లోడ్ చేసుకోవాలన్నారు. ముఖ్యంగా వ్యాపార సంస్థ నిర్వహించే వారు తమ షాపుల ప్రాంతాల్లో తప్పనిసరిగా సీసీ కెమెరాలు ఏర్పాటు చేసుకు నేలా పోలీస్ శాఖకు సహకరించాలన్నారు. ఈ కార్యక్రమంలో కోవూరు ఎస్సై రంగనాథ్ గౌడ్ ఉన్నారు.

## మట్టి నమూనా సేకరణకు రైతులు సహకరించాలి



**కోవూరు, ఏప్రిల్ 26 ప్రభాతవార్త :** కోవూరు మండలంలో ప్రస్తుతం జరుగుతున్న మట్టి నమూనా సేకరణకు రైతులు పూర్తిస్థాయిలో సహకరించాలని మండల వ్యవసాయాధికారిణి ఇందిరావతి అన్నారు. కోవూరు మండలం లేగుంటపాడు గ్రామ పంచాయతీలో శనివారం ప్రకృతి వ్యవసాయం మట్టి నమూనాలు, తదితర అంశాలపై రైతులకు అవగాహన కల్పించే కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ప్రస్తుతం వ్యవసాయం సాగు చేసే రైతులంతా ఏప్రిల్ 30వ తేదిలోగా తమ పొలాల్లో గ్రామ వ్యవసాయ సహాయకుల ద్వారా మట్టి నమూనాల పరీక్ష పూర్తి చేసుకోవాలన్నారు. ఈ విషయంలో రైతులు అలసత్వం ప్రదర్శించకుండా వీఏఏలకు సహకరించాలన్నారు. ప్రకృతి వ్యవసాయంపై ఉమా మహేశ్వరి మాట్లాడుతూ నవధాన్యాల కిట్లు ప్రతి రైతు పొలంలో చల్లుకుని నేల ఆరోగ్యాన్ని కాపాడుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ పోలంరెడ్డి వేణుగోపాల్‌రెడ్డి, వీఏఏ వంశీ, రైతులు ఉన్నారు. ఈ సందర్భంగా రైతులకు మట్టి నమూనా పరీక్షలు ఏ విధంగా చేయాలో వివరించారు.

## 50శాతం సబ్సిడీపై పచ్చిరొట్ట ఎరువుల విత్తనాలు పంపిణీ



**అనంతసాగరం, ఏప్రిల్26, ప్రభాతవార్త:** మండలంలోని కమ్మువారిపల్లి, సోమశిల గ్రామాల్లో శనివారం ప్రత్యామ్నాయ పంటల సాగుపై వ్యవసాయ శాఖ ఎఒ. శ్రీధర్‌రెడ్డి ఆధ్వర్యంలో అవగాహనా సదస్సును నిర్వహించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతి రెవెన్యూ గ్రామానికి 20భూసార పరీక్షలు నిర్వహించాలని కేటాయించారని కావున రైతు సోదరులు గ్రామ వ్యవసాయ సహాయకులతో కలిసి మట్టి నమూనాలను సేకరించేందుకు సహకరించాలని కోరారు. ఒకే రకమైన పంటలు ఖరీఫ్, రబీ సాగులో చేయడం వలన దిగుబడి తగ్గడమే కాక పురుగులు , తెగుళ్ళు బెడద ఎక్కువ అవుతుందని కావున సజ్జ, మొక్కజొన్న,వేరుశనగ వంటి పంటలతో పంట మార్పిడి చేయాలన్నారు. భూసారాన్ని పెంచి నేల ఉత్పాదకతను పెంపొందించడానికి రాష్ట్ర ప్రభుత్వం వారు 50శాతం సబ్సిడీతో పచ్చిరొట్ట ఎరువుల విత్తనాలు అన్ని రైతు సేవా కేంద్రాల్లో 115 క్వింటాళ్ళ జీలుగ , 33క్వింటాళ్ళ జనుములు ఉంచామన్నారు. జీలుగ విత్తనాలు 61.50రూపాయలు, జనుములు 54.50రూపాయలు రైతులు చెలి ంచి ఆయా రైతు సేవా కేంద్రాల్లో పొందాలన్నారు. ఈకార్యక్రమంలో దియ్యాల ప్రసాద్, శివారెడ్డి, కీర్తన, వీఎఎలు ఆయా గ్రామాల రైతులు పాల్గొన్నారు.

**డాక్యుమెంటు పోయినది**

కావలి టిట్-2 గ్రామ సర్వే నెం.1105 రాజీవ్ నగర్ లోని ప్లాటు నెం.2 డోరు నెం.1-10-28ఎ గల ఇంటికి సంబంధించిన లింకు డాక్యుమెంటు రిజిష్టరు పార్టిషన్ డీడ్ తేది 26.03.1997 దస్తావేజు నెం. 882/1997 కావలి ట్రంకురోడ్డులో 21.04.2025 తేదీన జెరాక్సుకు పోవుచుండగా పోయినది. దొరికిన వారు తెలియజేయగలరు.
RANGINENI YANADAMMA
Cell: 6382555819

**డాక్యుమెంట్ పోయినది**

ఎస్‌పిఎస్ఆర్ నెల్లూరు జిల్లా, కొడవలూరు మండలం, నార్త్ రాజుపాలెం గ్రామానికి చెందిన కొమర దామోదర్ తండ్రి వెంకటేశ్వరరావుకు సంబంధించిన డాక్యుమెంట్ నెంబర్ 1516/2023 కిమ్స్ హాస్పిటల్ పక్కన ఉన్న జెరాక్స్ షాప్‌లో ఒరిజినల్ డాక్యుమెంట్స్‌ను జెరాక్స్ తీయించుకుంటుండగా అందులో ఒక లింక్ డాక్యుమెంట్ అయినా 471/2004 dt. 29.04.2004 పోయినది సదర్ డాక్యుమెంట్ ఎవరికైనా దొరికిన యెడల కింది సెల్ నెంబర్‌కు తెలియచేసి, తెచ్చి ఇచ్చిన వారికి తగిన పారితోషకం ఇవ్వబడును.
కొమర దామోదర్ సెల్ నెం: 9866287729

## నీటి సంపద నిర్వహణకు నిధులును సిబ్బందిని కేటాయించాలి



**నెల్లూరు కలెక్టరేట్, ఏప్రిల్ 26, ప్రభాతవార్త** లక్ష కోట్లు విలువచేసే ఇరిగేషన్ సిస్టం నిర్వహణకు నిధులను సిబ్బందిని కేటాయించాలని తెలుగు గంగ ఎస్ ఈ రాధాకృ ష్ణారెడ్డికి బిజెపి నమామి గంగే రాష్ట్ర కన్వీనర్ మిడతల రమేష్ విజ్ఞప్తి చేశారు. సోమశిల కండలేరు డ్యాములతో పాటు ఉమ్మడి నెల్లూరు జిల్లాలో 1720 చెరువులు 2200 పంట కాలువలు చిన్న కాలువలు లక్ష కోట్లు విలువ చేస్తాయి. నెల్లూరు జిల్లా ఇరిగేషన్ రంగంలో మెయింటెనెన్స్‌కు నిధులు లేని కారణంగా నీటి వృధా ఎక్కువగా జరుగుతుంది. సోమశిల కండలేరు వరద కాలువ 5.5 కిలోమీటర్ల వద్దనున్న రెగ్యులేటర్ గేట్లు సకాలంలో దిగకపోవడంతో రోడ్డు కొట్టుకుపోవడం పంట పొలాల్లోకి నీరు ప్రవహించడంను గుర్తు చేశారు. కండలేరు లో లెవెల్ స్లూఇస్ గేటు దిగకపోవడంతో వాగు ద్వారానీటి వృధా జరిగింది. ప్రస్తుతం తాత్కాలిక మరమ్మతులు చేశారు. సోమశిల కండలేరు డ్యాములులో నిర్వహణకు సాంకేతిక సిబ్బంది లేరు. ఉన్న జలవనరుల వినియోగానికి రక్షణకు నియామకాలు లేవు. నెల్లూరు బ్యారేజీ వద్ద సామాగ్రినీ తిక్కన మందిరం పక్కన ఉంచారు. కనీసం వాచ్మెన్ కూడా లేకపోవడంతో ఐరన్ మెటీరియల్ దొంగలు ఎత్తుకు పోతున్నారు. ఏడాది క్రితం సామాగ్రి దొంగలింప బడినప్పుడు ఏఈ శ్రీకాంత్ రికవరీ చేశారు.. సాగునీటి కాలువలు రెగ్యులేటర్లు తూములు నిర్వహణకు జిల్లాలో సిబ్బంది లేరు. 2021 లో సోమశిల డ్యామ్ ముందు భాగంలో దెబ్బతిన్న ఆఫ్రాన్ కు నిధులు లేవని పనులు నిలిపేశారు .సోమశిల కు వరద వస్తే చేసిన పనులు కూడా దెబ్బతింటాయి. సోమశిల కండలేరు కాలువ వైడనింగ్ పనులు నిధులు లేవని ఆపేశారు. నెల్లూరు జిల్లా ఇరిగేషన్ రంగంలో పెండింగ్ పనులు రాష్ట్ర ప్రయారిటీ జాబితాలో లేనట్లు ఉన్నాయి. నీటి వృధాను అరికట్టేందుకు లక్ష కోట్లు విలువ చేసే డ్యాములు చెరువులు పంట కాలువలు కట్టడాలు నిర్వహణ కోసం నిధులను సిబ్బందిని నియమించాలని రమేష్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు.నరాల సుబ్బారెడ్డి నీలి శెట్టి లక్ష్మణరావు వీరస్వామి తదితరులు పాల్గొన్నారు.

## అభయాంజనేయస్వామి సన్నిధిలో అన్నదానం



**వింజమూరు, ఏప్రిల్ 26, ప్రభా తవార్త** వింజమూరులోని పాతూరు నందు వేంచేసియున్న శ్రీ అభయాంజ నేయస్వామి వారి విగ్రహ ప్రతిష్ఠ మహోత్సవాలలో భాగంగా శనివారం గొప్ప అన్నదాన కార్యక్ర మాన్ని జరిపించారు. శుక్రవారం ఉదయాన్నే అభిషేకములు ప్రత్యేక పూజా కార్యక్రమాలు జరిపించే సాయంత్రం స్వామివారి గ్రామోత్సవం నిర్వహించారు. రెండో రోజు శనివారం ఉదయాన్నే స్వామివారికి ప్రత్యేక అభిషేకంలో పూజా కార్యక్రమం జరిపించారు. తదుపరి హోమం నిర్వహించారు. మధ్యాహ్నం గొప్ప అన్నదానం జరిగింది. భక్తులు అధిక సంఖ్యలో విచ్చేసి అన్నదాన కార్యక్రమంలో పాల్గొని స్వామివారిని కనులారా దర్శించి తీర్ధ ప్రసాదాలను స్వీకరించారు. స్వామివారికి తమకు తోచిన విధంగా నగదును విరాళంగా అందజేశారు. ఈ కార్యక్రమాలను స్వామివారి భక్త బృందం పర్యవేక్షించారు.

## నోషనల్ ఖాతాలను మార్చుకునే అవకాశం



**వింజమూరు, ఏప్రిల్ 26, ప్రభా తవార్త** వింజమూరు మండలంలోని రైతులు తమ భూములకు సంబం ధించిన పట్టా నంబర్ల నోషనల్ ఖా తాలను రెగ్యులర్ ఖాతాగా మార్చుకు నేందుకు ఉన్న అవకాశాన్ని సద్విని యో గపరుచుకోవాలని తహశీల్దారన ఎస్డీ హమీద్ తెలిపారు. ప్రస్తుతం నోషనల్ ఖాతాలను మార్చేం దుకు ప్ర త్యేక డ్రైవ్ నిర్వహిస్తున్నామని, అయి నా రైతులు స్పందించడం లేదన్నారు. నోషనల్ ఖాతాలను మార్చుకోనట్లయితే వన్ బి రాదని అలాగే రుణ సౌకర్యం కూడా ఉండదన్నారు. వీటన్నింటిని దృష్టిలో ఉంచుకుని రైతన్నలు తమ పట్టా నోషనల్ ఖాతాలను వెంటనే మార్చుకోవాల్సిందిగా ఆయన కోరారు. మండలంలోని రైతులు ఈ అవకాశాన్ని సద్వినియోగ పరుచుకోవాలని అన్నారు.

## సైదాపురం మండల తహసీల్దార్‌ని సస్పెండ్ చేయాలి



**నెల్లూరు కలెక్టరేట్, ఏప్రిల్ 26, ప్రభాతవార్త** అఖిల భారత రైతు కూలీ సంఘం జిల్లా కమిటీ ఆధ్వర్యంలో శనివారం ఊటుకూరు దళితులపై సైదాపురం తహశీల్దారు అక్రమంగా పెట్టిన కేసులను ఎత్తివేసి, మైనింగ్ మాఫియాకు కొమ్ము కాస్తున్న తహశీల్దారుని సస్పెండ్ చేయాలనీ, మహిళల పట్ల దురుసుగా ప్రవర్తించి కేసులు పెట్టి జైలుకు పంపుతామని బెదిరించిన సైదాపురం సబ్‌ఇన్స్పెక్టరు పై తగు చర్యలు తీసుకోవాలని, సర్వేనెంబర్ 356, 359 గల 400 ఎకరముల ప్రభుత్వ భూములను ఆక్రమణలు తొలగించి దళితులకు ఇతర పేదలకు పంచాలని, దళితులు అక్రమణలోగల ప్రభుత్వ భూములకు యాజమాన్యం హక్కు కల్పించాలని డిమాండ్ చేస్తూ శనివారం నెల్లూరు రెవెన్యు డివిజనల్ కార్యాలయం వద్ద అఖిల భారత రైతుల కూలీ సంఘం అధ్వర్యంలో ధర్నా చేసి నెల్లూరు రెవెన్యు డివిజనల్ అధికారి నాగా సంతోష్ అనూషకి వినతి పత్రం సమర్పించారు. ఆ సందర్భంగా జరిగిన ధర్నాను ఉద్దేశించి అఖిల భారత రైతుల కూలీ సంఘం జిల్లా అధ్యక్షుడు డి.పి పోలయ్య మాట్లాడుతూ ప్రతిఘటన పోరాటాల ద్వారానే భూస్వాముల ఆక్రమణలో గల ప్రభుత్వ బంజరు భూములను స్వాధీనం చేసుకోవాలని పిలుపునిచ్చారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చి 10 నెలలో దళితుల పై అక్రమ కేసులు, పోలీసుల వేదింపులు, భూ ఆక్రమణలు అధికార పార్టీ అండదండలతో ఎదేచ్చగా కొనసాగుతున్న వాటిని అరికట్టడంలో కూటమి ప్రభుత్వం పూర్తిగా వైఫల్యం చెందిందన్నారు. ఈ నేపధ్యంలో ఉటుకూరు గ్రామంలో వెంకటకృష్ణ మైనింగ్ కంపెనీకి గ్రామ సర్వే నెం. 359పి1లో 60 ఎకరముల ప్రభుత్వ భూమిని మైనింగ్ లీజుకు కొరకు అప్లై చేసుకున్నారన్నారు, ఇంకా ఇ.సి. కుడా పెండింగ్‌లో వుందన్నారు. ఈ క్రమంలో అదే సర్వే నెం. 359పి2లో 50 ఎకరముల ప్రభుత్వ భూమిని దళితులు ఆక్రమించి వ్యవసాయం చేసుకొనే క్రమంలో మైనింగ్ మాఫియకు సైదాపురం తహశీల్దారు ఎలాంటి అనుమతులు లేకుండా దళితుల ఆక్రమణలో వున్న ప్రభుత్వ భూములను వెంకటకృష్ణ మైనింగు కంపెనీకి అప్పగించడం వల్ల మైనింగ్ మాఫియ పోలీసులు ద్వారా వత్తిడి చేసి దళితులపై అక్రమ కేసులు పెట్టించారన్నారు. ఈ కార్యక్రమంలో భారత కార్మిక సంఘాల సమైఖ్య జిల్లా అధ్యక్షులు కె. రమేష్, ప్రగతి శీల మహిళా సంఘం నాయకురాలు బి. మమత,ఎ.నాగమణి, ఎం. వెంకరమణమ్మ, అఖిల భారత రైతు కూలీ సంఘం నాయకులు, పి. కోటయ్య, పి.శ్రీను, ఎ. హరిబాబు, ఆనంద్ తదితరులు పాల్గొన్నారు.

## మజ్జిగ చలివేంద్రాన్ని ప్రారంభించిన పర్వతరెడ్డి



నెల్లూరు రూరల్,ఏప్రిల్ 26, ప్రభాతవార్త వైస్సార్సీపీ విద్యార్థి విభాగం నేత తౌఫిక్ ఏర్పాటు చేసిన చలివేంద్రాన్ని పర్వత రెడ్డి చంద్రశేఖర్ రెడ్డి ప్రారంభించారు. అనంతరం పలువురు స్థానికులకు చంద్రశేఖర్ రెడ్డి మజ్జిగ అందజేశారు. చలివేంద్రం ఏర్పాటు ఆలోచన చేసిన తౌఫిక్‌ను చంద్రశేఖర్ రెడ్డి అభినందించారు. ఈ సందర్భంగా పర్వత రెడ్డి చంద్రశేఖర్ రెడ్డి మాట్లాడుతూ ప్రజల దాహార్తి తీర్చేందుకు ఎక్కడికక్కడ వైసిపి నేతలు ముందుకొచ్చి చలివేంద్రాలను ఏర్పాటు చేయడం అభినందనీయమని తెలిపారు. అందులో భాగంగా ఈరోజు 39 వ డివిజన్లో స్థానిక విద్యార్థి విభాగం నేత తౌఫిక్ ముందుకొచ్చి చలివేంద్రం ఏర్పాటు చేయడం సంతోషకరమన్నారు. ప్రజాసేవ చేయడంలో వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ నాయకులు ఎల్లప్పుడు ముందుంటారని తెలిపారు.

# మెప్మా అర్బన్ మార్కెట్‌ను ఆదరించండి

## - చైర్‌పర్సన్ మోర్ల సుప్రజా



**బుచ్చి ఏఫ్రిల్ 26 ప్రభాతవార్త :** బుచ్చిరెడ్డిపాళెం పట్టణంలోని పార్కు సెంటర్ వద్ద మెప్మా ఆధ్వర్యంలో అర్బన్ మార్కెట్ ఏర్పాటు చేశారు.మెప్మా పొదుపు సంఘాల మహిళలు స్వయంగా తయారు చేసిన పలు రకాల వస్తువులను ఆహారా పదార్ధాలను ప్రదర్శనగా ఏర్పాటు చేశారు.ఈ సందర్భంగా నగర పంచాయితీ చైర్‌పర్సన్ మోర్ల సుప్రజా మురళీ,వైస్ చైర్మన్లు యరటపల్లి శివకుమార్‌రెడ్డి, పఠాన్ నస్రీన్, కౌన్సిలర్లతో కలిసి అర్బన్ మార్కెట్‌ను సందర్శించారు. మహిళలు స్వయంగా తయారు చేసిన వస్తువులను కొనుగోలు చేసి వారిని అభినందించారు. అనంతరం చైర్‌పర్సన్ మోర్ల సుప్రజా మీడియాతో మాట్లాడుతు మహిళలు పొదుపు సంఘాల ద్వారా తీసుకుంటున్న రుణాలు సద్వినియోగం చేసుకొని వ్యాపారాలు చేసుకుంటు స్వయం శక్తితో ఎదగాలన్నారు. మహిలు ఉన్నత స్థాయికి ఎదిగేందుకు రాష్ట్ర ప్రభుత్వ ద్వారా మెప్మా లోని పొదుపు సంఘాల మహిళలకు పూర్తి సహకారాన్ని అందిస్తున్నామని చెప్పారు. తక్కువ ధరలకే నాణ్యమైన వస్తువులను ఆహార పదార్ధాలను తయారు చేసి విక్రయించడం సంతోషంగా ఉందన్నారు. ఈకార్యక్రమంలో కౌన్సిలర్లు పుట్టా లక్ష్మీకాంతమ్మ, తాళ్ళ వైష్ణవి, రాచూరు సత్యనారాయణ, బెళ్ళం మల్లారెడ్డి, మెప్మా సిఎంఎం అంకయ్య, మెప్మా సివో నర్మద, ఆర్పీలు, పొదుపు సంఘాల మహిళలు తదితరులు పాల్గొన్నారు.

# కావలి విఎస్‌యు కళాశాల ప్రిన్సిపాల్‌గా చిలుమూరి



**కావలిరూరల్, ఏప్రిల్26 ప్రభాతవార్త :** ఆచార్య చిలుమూరి శ్రీనివాసరావు కావలి విక్రమసింహపురి యూనివర్సిటి కళాశాల ప్రిన్సిపాల్‌గా శనివారం బాధ్యతలు స్వీకరించడం జరిగింది. ఈయన గతంలో పి.జి సెంటర్ స్పెషల్ ఆఫీసర్‌గా, ప్రిన్సిపాల్‌గా డీన్ ఫ్యాకల్టీ ఆఫ్ కామర్స్ అండ్ మేనేజ్‌మెంట్‌గా, ఎగ్జిక్యూటివ్ కౌన్సిల్ మెంబర్‌గా విక్రమసింహపురి యూనివర్సిటీలో పనిచేయడం జరిగింది. ప్రస్తుతం కామర్స్ విభాగానికి హెడ్‌గా, టూరిజం మేనేజ్‌మెంట్ విభాగానికి, బిఓఎస్ ఛైర్మన్‌గా ఉన్నారు. 30 సంవత్సరాల బోధనా పరిశోధన అనుభవం ఉంది. 14 పుస్తకాలు, వివిధ జాతీయ, అంతర్జాతీయ పత్రికల్లో 39 పరిశోధన పత్రాలు ప్రచురించారు. మూడు జాతీయ సెమినార్లు ఆర్గనైజ్ చేశారు. అనేక ప్రాజెక్టులను కూడా పూర్తిచేశారు. ఈ సందర్భంగా కళాశాల ప్రొఫెసర్లు ఆచార్య చిలుమూరి శ్రీనివాసరావుకి ఘనంగా స్వాగతం పలికి, పూలబొకెను అందచేసి దుశ్శాలువాలతో ఘనంగా సత్కరించడం జరిగింది.

# జీవో నెంబర్ 35ను సవరించాలి

**- పంచాయతీరాజ్ ఉద్యోగుల డిమాండ్**



**నెల్లూరు కలెక్టరేట్, ఏప్రిల్ 26, ప్రభాతవార్త :** ఇటీవల ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ప్రభుత్వం పంచాయతీరాజ్ శాఖ నందు చేపట్టిన ప్రక్షాళనలో భాగంగా మండల పరిషత్ అభివృద్ధి అధికారుల ప్రత్యక్ష నియామకాలను రద్దు చేయుచు వాటిని పదోన్నతుల ద్వారా నియమించాలని విడుదల చేసిన జీవో నెంబర్ 35 నందు మండల పరిషత్ అభివృద్ధి అధికారుల పదోన్నతులకు ఫీడర్ కేటగిరీ లలో సమానమైన విస్తరణ అధికారుల, పరిపాలన అధికారులకు సమానముగా కేటాయింపులు జరపక ప్రత్యక్ష నియామకాల కేటాయింపు 30ను ఏక మొత్తముగా విస్తరణాధికారులకే కేటాయింపును, విస్తరణ అధికారులను మాత్రమే ఉప మండల పరిషత్ అభివృద్ధి అధికారులుగా పేరు మార్చుట, పరిపాలనాధికారులకు పూర్వం కేటాయించి ఉన్న 34 శాతమును మాత్రమే కొనసాగించి సదరు కేటాయింపును కూడా క్యాడర్ ఆధారంగా కాకుండా ఖాళీల ఆధారంగా కేటాయింపు చేయుట వలన జిల్లా ప్రజా పరిషత్, మండల ప్రజాపరిషత్, ఇంజనీరింగ్ కార్యాలయంలో, జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో పనిచేయుచున్న పరిపాలన అధికారులు, సీనియర్ సహాయకులు, జూనియర్ సహాయకులు, రికార్డు /ల్యాబ్/ లైబ్రరీ సహాయకులు, నాలుగో తరగతి సిబ్బందుల పదోన్నతులలో స్తబ్దత ఏర్పడి ఒకే హోదాలో పనిచేసి పదవి విరమణ చేయవలసిన పరిస్థితి ఏర్పడి పంచాయతీరాజ్ శాఖలో అసమానతలు ఏర్పడుతున్నవి. అందువల్ల ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి, ఉప ముఖ్యమంత్రి వర్యులు పంచాయతీరాజ్ శాఖ మాత్యులు వారిని పంచాయతీరాజ్ శాఖ నందు సదరు అసమానతలును తొలగించుటకుగాను జీవో నెంబర్ 35ను సవరించవలసినదిగా ఆంధ్రప్రదేశ్ పంచాయతీరాజ్ పరిపాలన అధికారుల సంఘం ఆంధ్రప్రదేశ్ పంచాయతీరాజ్ మినిస్ట్రీయల్ ఉద్యోగుల సంఘం, ఆంధ్రప్రదేశ్ పంచాయతీరాజ్ 4వ తరగతి ఉద్యోగుల సంఘం నెల్లూరు జిల్లా శాఖ తరపున విన్నవించుకోనడమైనది.

# స్వల్ప వ్యవధిలో కేసు ఛేదించారు

**- ప్రశంసలందుకున్న చిన్న బజార్ పోలీసులు**



**నెల్లూరు క్రైమ్, ఏప్రిల్ 26, ప్రభాతవార్త :** తరచూ జరిగే సైబర్ నేరాలు పోలీసులకు పెను సవాళ్లు విసురుతున్నాయి. ఎక్కడో ఇతర రాష్ట్రాల్లో ఉంటూ ఇక్కడ నేరాలకు పాల్పడే సైబర్ నేరస్తులను పట్టుకోవడం పోలీసులకు కష్టంగా మారుతున్న తరుణంలో సైబర్ నేరం కేసు నమోదైన కొద్దిరోజుల వ్యవధిలోనే అంతర్రాష్ట్ర సైబర్ ముఠాను అదుపులోకి తీసుకుని శభాష్ అనిపించుకున్నారు. చిన్న బజార్ పోలీసులు. ఈనెల తొమ్మిదవ తేదీన చిన్న బజార్ పోలీస్ స్టేషన్ పరిధిలో జరిగిన సైబర్ నేరంలో లోతైన దర్యాప్తు చేపట్టడం ద్వారా, సాంకేతిక పరిజ్ఞానాన్ని పూర్తిగా వినియోగించుకున్నారు. ఈ క్రమంలో తమ పరిధిలో జరిగిన నేరం మాత్రమే కాకుండా ఈ తరహా నేరాలకు పాల్పడుతున్న రాజస్థాన్ కు చెందిన ఐదుగురు సభ్యుల బృందంతో పాటు మొత్తం 7 మంది సభ్యుల ముఠాను సైబర్ నేరాల ముఠాను చిన్న బజార్ సీఐ చిట్టెం కోటేశ్వరరావు తన బృందంతో కలిసి అతి త్వరగా పట్టుకోవడంలో విశేష ప్రతిభ కనబరిచారు. ఉన్నతాధికారుల సూచనలు మేరకు లోతైన దర్యాప్తు చేపట్టి సాంకేతిక పరిజ్ఞానాన్ని సద్వినియోగం చేసుకోవడం ద్వారా నేరగాళ్లను త్వరగా పట్టుకోగలిగామని సీఐ తెలిపారు. ఈ కేసులో అత్యంత ప్రతిభ కనబరిచిన సిఐ చిట్టెం కోటేశ్వరరావు తో పాటు ఎస్సై ఇతర పోలీస్ సిబ్బందిని జిల్లా ఎస్పీ అభినందించడంతోపాటు రివార్డులు అందజేశారు. మరోవైపు నగరవాసులు కూడా చిన్న బజార్ పోలీసుల పనితీరుపై ప్రశంసలు అందిస్తున్నారు.

# ఎంపీటీసీ నాగరాజుపై తగు చర్యలు తీసుకోవాలి

**- పోలీస్‌స్టేషన్‌లో బీసీ సంఘం ఫిర్యాదు**



**కోవూరు, ఏప్రిల్ 26 ప్రభాతవార్త :** ఆంధ్రప్రదేశ్ బీసీ సంఘం యూత్ రాష్ట్ర అధ్యక్షుడు మద్దునూరు సుభాష్ యాదవ్‌పై తప్పుడు ప్రచారం చేస్తున్న ఎంపీటీసీ సభ్యులు నాగరాజు, శివప్రసాద్ ఆచారిలపై తగు చర్యలు తీసుకోవాలంటూ శనివారం కోవూరు పోలీస్‌స్టేషన్‌లో ఆంధ్రప్రదేశ్ బీసీ సంఘం ఆధ్వర్యంలో ఫిర్యాదు చేశారు. ఈ సందర్భంగా పలువురు బీసీ సంఘం నాయకులు మాట్లాడుతూ ఇటీవల జిల్లా కలెక్టర్‌కు ప్రజాపరిష్కార వేదికలో తమ రాష్ట్ర అధ్యక్షుడు మద్దునూరు సుభాష్ యాదవ్ బీసీ సబ్సిడీ రుణాల అవకతవకలపై విచారణ జరిపించాలని వినతిపత్రం ఇచ్చారన్నారు. ఇది విచారణ జరిగితే అధికారుల గుట్టు బయటపడుతుందనే భయంతో కొంత మంది అధికారులు వారికి తొత్తులుగా ఉన్న పోతిరెడ్డిపాలెం గ్రామానికి చెందిన ఎంపీటీసీ సభ్యులు నాగరాజు, శివప్రసాద్ ఆచారిల ద్వారా అసలు సబ్సిడీ రుణాల్లో అవకతవకలు జరగలేదని, సుభాష్ యాదవ్ అసలు బీసీ సంఘం నాయకుడు కాదని విమర్శించారన్నారు. గత 13 సంవత్సరాలుగా బీసీ సంఘంలో పనిచేస్తున్న సుభాష్ యాదవ్‌ను బీసీ సంఘం నాయకుడు కాదని అనడం వారి అవివేకానికి నిదర్శనం అన్నారు. ఇటువంటి ఇవకతవకలకు పాల్పడుతున్న అధికారులకు మద్దతుగా ఉన్న వీరిరువురిపై తగు చర్యలు తీసుకోవాలన్నారు. మరోసారి ఇటువంటి ఆరోపణలు చేస్తే వారిరువురికి బుద్ధి చెబుతామని తీవ్రస్థాయిలో హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో బీసీ నేతలు వి. కార్తీక్, జె. వెంకటేశ్వర్లు గౌడ్, సీహెచ్ వెంకటరమణయ్య యాదవ్, షేక్ యాషన్‌బాబు, ఏ. నాగరాజు యాదవ్, కె. రమేష్, ఎన్. శ్రీనివాసులు, పెంచలయ్య, మాల్యాద్రి, జిల్లా ప్రధాన కార్యదర్శి కె. హరీష్, శ్రావణ్, రమేష్, మురళీయాదవ్, సాయికృష్ణ యాదవ్, తదితరులు ఉన్నారు.

# పోలీసు బూట్లచప్పుళ్లతో దద్దరిల్లిన వైకుంఠపురం..!!

## 55 ద్విచక్రవాహనాలు, 3 ఆటోలు స్వాధీనం..!!!



**కావలి, ఏప్రిల్26 ప్రభాతవార్త :** కావలి పట్టణం వైకుంతపురం పెంకులఫ్యాక్టరీ, గిరిజనకాలనీల సమీపంలో పోలీసుబృందాలు ఆకస్మిక దాడులు నిర్వహించి ప్రతి నివాసంలో నఖశిఖపర్యంతం తనిఖీ చేశారు. శనివారం తెల్లవారుజామున పోలీసుబూట్ల చప్పుళ్లతో ఆ ప్రాంతం ఒక్కసారిగా దద్దరిల్లింది. ఒక్కసారిగా పోలీసుబృందాలు అడుగుపెట్టడంతో ప్రజలు భయకంం ి తుల య్యారు. ప్రతి ఇంటిలోనివారిని బయటకు పోనీయకుండా పోలీసులు తనిఖీలు చేశారు. ఈ తనిఖీల్లో సరైన పత్రాలులేని 55 ద్విచక్రవాహనాలు, 3 ఆటోలు పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. ఈ సందర్భంగా ప్రజలనుద్దేశించి కావలి డీఎస్పీ శ్రీధర్ కార్డన్‌సెర్చ్‌పై అవగాహన కల్పించారు. మారణాయుధాలు, సారాయి, గంజాయి, తదితరవాటిని నిరోధించేందుకే పోలీసులు ఈ తనిఖీలు నిర్వహించడం జరిగిందన్నారు. అపరిచిత వ్యక్తుల సంచారంకూడా ఉండకూడదన్నారు. నేరస్తులకు ఏ ఒక్కరూ ఆశ్రయం ఇవ్వకూడదన్నారు. ప్రజలు ప్రశాంత వాతావరణంలో పయనించాలన్న సంకల్పంతో ఇలాంటి తనిఖీలు నిర్వహిస్తూ ప్రజలను అప్రమత్తం చేయడం జరుగుతుందన్నారు. ఈ తనిఖీల్లో కొంతమంది ఫింగర్‌ప్రింట్స్ కూడా తీసుకోవడం జరిగిందన్నారు. కొంతమంది అనుమానితులను అదుపులోకి తీసుకోవడం జరిగిందన్నారు. నేరస్తుల కదలికలు కూడా తెలుసుకోవడంలో పోలీసులు అప్రమత్తంగా ఉన్నారన్నారు. దాదాపు 45 మంది ఫింగర్‌ప్రింట్స్ తీసుకోవడం జరిగిందన్నారు. కొత్తవ్యక్తులు వచ్చినా, అసాంఘిక కార్యకలాపాలు చేస్తున్నా పోలీసుల దృష్టికి తీసుకురావాలన్నారు. కావలి డీఎస్పీ శ్రీధర్ ఆధ్వర్యంలో సర్కిల్ ఇన్స్‌పెక్టర్లు ఫిరోజ్, గిరిబాబు, రాజేశ్వరరావు, పాపారావు 10 మంది ఎస్ఐలు, 50 మంది సిబ్బంది ఈ తనిఖీల్లో పాల్గొన్నారు.

# బంగారు నగల దొంగల అరెస్ట్ - 7లక్షల ఆభరణాలు స్వాధీనం





**ఆత్మకూరు,ఏప్రిల్26,ప్రభాతవార్త:** ఆత్మకూరు పట్టణంలో సంచలనాత్మకమైన భారీ బంగారు నగల చోరీలో నిందితులను ఆత్మకూరు పోలీసులు పసిగట్టి ఆచూకీని సేకరించి వారిని అరెస్ట్ చేయడంతోపాటు వారి నుండి 7లక్షల రూపాయల విలువైన బంగారు, వెండిని స్వాధీనం చేసుకున్నారు. శనివారం స్థానిక డియస్పీ కె.వేణుగోపాల్ ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో నిందితులను చూపి వివరాలు తెలిపారు. ఆత్మకూరు పట్టణంలోని మెయిన్ బజార్‌లో చేజర్ల రమణమూర్తి తన షాపును మూసివేసే సమయంలో ఆయన చేతిలో ఉన్న బంగారు , వెండి వస్తువుల బ్యాగునుపక్కనపెట్టి షట్టర్‌కు తాళం వేసుకునే సమయంలో కొందరు గుర్తు తెలియని వ్యక్తులు మోటర్‌బైక్‌పై వచ్చి బ్యాగును దొంగిలించుకొని మోటార్‌సైకిల్‌పై వేగంగా పారిపోయారని డియస్పీ తెలిపారు. ఈమేరకు బాధితుడు ఫిర్యాదు చేయగా కేసు నమోదు చేశామని దర్యాప్తు ప్రారంభించి సిసి ఫుటేజీల ఆధారంగా శనివారం బోయిళ్ళచిరువెళ్ళ గ్రామం వద్ద అనుమానాస్పదంగా తిరుగుతుండగా ఇరువురిని అదుపులోకి తీసుకొని ప్రశ్నించగా వారు చేసిన నేరంఒప్పు కున్నార న్నారు. వారి వద్ద ఉన్న చోరీ సొత్తును స్వాధీనం చేసుకున్నామన్నారు. ఈకేసులో నిందితుల ఆచూకీ సాధించేందుకు ప్రతిభ కనపరచిన ఆత్మకూరు సర్కిల్ ఇన్స్‌పెక్టర్ జి.గంగాధర్, ఆత్మకూరు ఎస్ఐలు ఎస్.కె.జిలాని, ఎస్.సాయిప్రసాద్, కె.శ్రీనివాసులురెడ్డి, కానిస్టేబుల్స్ విజయ్,సతీష్, షరీఫ్, అలీ,అశోక్‌కుమార్ లను డియస్పీ కె.వేణుగోపాల్ అభినందించారు. నిందితులు గుడివాడకు చెందిన బంతు ముంగయ్య, పల్నాడు జిల్లా అచ్చంపేటకు చెందిన ఓటేరు సాయిలను అరెస్ట్ చేసి కోర్టులో హాజరుపరుస్తామని మరో నిందితుడు రుద్ర పరారీలో ఉన్నాడని డియస్పీ పేర్కొన్నారు.

# వీఆర్ హైస్కూల్‌ను రాష్ట్రంలోనే నంబర్‌వన్ మోడల్ స్కూల్‌గా తీర్చిదిద్దుతాం



**నెల్లూరు, ఏప్రిల్ 26, ప్రభాతవార్త – వైద్యం :** నెల్లూరు వీఆర్ హైస్కూల్‌ను రాష్ట్రంలోనే నంబర్ వన్ మోడల్ స్కూల్‌గా తీర్చిదిద్దుతామని రాష్ట్ర పురపాలక పట్టణాభివృద్ధి శాఖ మంత్రి పొంగూరు నారాయణ అన్నారు. శనివారం నెల్లూరు వీఆర్ హైస్కూల్‌లో జరుగుతున్న ఆధునీకరణ పనులను మంత్రి నారాయణ పరిశీలించారు. వీఆర్ హైస్కూల్‌లో చేపట్టాల్సిన, చేపట్టిన పనులను మంత్రి క్షుణ్ణంగా పరిశీలించి అధికారులకు పలు సూచనలు చేశారు. తాను ఇదే హైస్కూల్‌లో చదివిన అనుభూతిని హర్షం వ్యక్తం చేస్తూ తెలియజేశారు. అనంతరం మున్సిపల్ జూనియర్ కాలేజీలో స్కిల్ దవలప్‌మెంట్‌లో శిక్షణ పొందుతున్న విద్యార్థినులకు మంత్రి డాక్టర్ పొంగూరు నారాయణ కిట్లు పంపిణీ చేశారు. విద్యార్థినీలతో శిక్షణ పొందిన విధానాన్ని మంత్రి వర్యులు అడిగి తెలుసుకున్నారు.

# వాహనాలు తనీఖి చేసిన సంగం ఎస్ఐ



**సంగం ఏఫ్రిల్ 26 ప్రభాతవార్త :** మండలకేంద్రమైన సంగంలో ఎస్ఐ రాజేష్ తన సిబ్బందితో కలిసి వాహనాలు తనీఖి చేశారు.జిల్లా ఎస్పి ఆదేశాను సారం వాహనాలు తనీఖి చేసినట్లు తెలిపారు.ఈ సందర్భంగా ఎస్ఐ మాట్లాడుతు ప్రతి వాహనాన్ని క్షుణ్ణంగా పరిశీలిస్తున్నట్లు తెలిపారు. అలాగే ద్విచక్రవాహనాలపై త్రిబుల్ రైడింగ్ చేస్తే చర్యలు తప్పవని హెచ్చరించారు. అలాగే ద్విచక్రవాహనదారులు తప్పకుండా హెల్మెట్ ధరించాలని ఆయన సూచించారు. ఈకార్యక్రమంలో ఆయన వెంట సిబ్బంది ఉన్నారు.

# సదరన్ చానల్‌పై వంతెనలకు మోక్షం ఎప్పుడు



**బుచ్చి ఏఫ్రిల్ 26 ప్రభాతవార్త :** సదరన్ చానల్‌పైన వున్న వంతెనలకు మోక్షం ఎప్పుడు అని ప్రజలు ప్రశ్నిస్తున్నారు. గత ప్రభుత్వం హాయంలో ఈవంతెనలకు నిధులు మంజూరు అయినా నూతన వంతెనెలు నిర్మాణం కాలేదు.ఈ ప్రభుత్వం హాయంలో నీటి సంఘాలు కూడా ఏర్పాడ్డాయి. ఇప్పుడైనా వంతెనలు నిర్మాణాలు జరిగేనా అని ఆయా గ్రామాల ప్రజలు ఎదురు చూస్తున్నారు. సంగం మండలంలోని అన్నారెడ్డిపాళెం గ్రామం మొదట్లో ఉన్న వున్న వంతెన అత్యంత ప్రమాదభరితంగా ఉంది.ఈ వంతెన ఆగ్రామానికి ఆదారం. ఏమాత్రం వంతెన కూలిపోతే గ్రామానికి రాకపోకలు స్తంభిస్తాయి. అలాగే మినగల్లు గ్రామానికి చెందిన వంతెన భారీ ఇసుక వహనలు వెళ్ళి వంతెన కూలి పోయింది. పడమటి అరవపాళెం దగ్గర వంతెన లేక ప్రజలు నానా ఇబ్బందులు పడుతున్నారు.నీటి సంఘాల అద్యక్షులు కోవూరు శాసనసభ్యురాలు వేమరెడ్డి ప్రశాంతిరెడ్డి దృష్టికి తీసుకొని వెళ్లి సదరన్ చానల్‌పైన వంతెనలు నిర్మాంచాల్సిన అవసరం ఎంతైనా ఉంది.





# లక్ష్మీదేవీ కరుణించు తల్లీ ...భక్తుల ఆవేదన

## అమ్మవారి దర్శనానికి ఇబ్బందులు



**వలేటివారిపాలెం ఏప్రిల్ 26, ప్రభాతవార్త :** మాలకొండలో శ్రీ లక్ష్మీదేవి అమ్మవారి దర్శనానికి మెట్లదారి నందలి క్యూలోని భక్తులు శనివారం నానా ఇబ్బందులుకు గురైనారు.క్యూలైన్‌లో ఒకరినొకరు రాసుకుంటూ, చెమటకి,ఉక్కపోతతో ఇబ్బందివడ్డారు.నిర్వాహకులును,పాలకులను నిందించారు.లక్ష్మీదేవీ అమ్మవారూ. .కరుణించు తల్లీ అంటూ భక్తులు అమ్మవారిని వేడుకున్నారు.అమ్మవారి ఆలయంకు రానూ,పోనూ వేరు వేరు దారి సౌకర్యం కలి ్పంచాలని అధికారులుకు విజ్ఞప్తిచేస్తున్నారు.ఆలయంకు వెళ్లే భక్తులకు,దర్శనానంతరం తిరిగి వచ్చే భక్తులుకు ఒకటే దారి కావడంతో నానా ఇబ్బందులు పడుతున్నారు. అమ ్మవారు కొండశిఖరంపై కొలువై ఉన్నారు.ఈ ఆలయాన్ని లక్ష్మమ్మపేటగా పిలుస్తారు.ఇక్కడ కొలువై ఉండడానికి ఓ ప్రత్యేకత ఉంది.స్వామివారు వేటకై వెళ్లిన సందర్భంలో అడవిలో చెంచులక్ష్మిని పరిణయమాడడంతో లక్ష్మీదేవి కోపోద్రిక్తులైందట.ఆమె అలకపూని కొండశిఖరం మీదుకు వెళ్లి కొలువైనట్లు స్థలపురాణం చెప్తుంది.లక్ష్మక్కపేటకు వెళ్ల సందర ్భంగా పెద్దపెద్ద బండలుసైతం ఆమె కోపాగ్నికి బద్దలై రెండుగా చీలి దారి మార్గం ఏర్పాటుచేశాయి.ఈ చీలికదారికి ఓ ప్రత్యేకత ఉంది.ఈ దారిలో 340కి పైగా మెట్లు ఏర్పాటుచేశారు.ఎంతటి స్థూలకాయులైన అవలీలగా లక్ష్మక్కపేటకు చేరతారన్న నానుడి ఉంది. దీంతో మాలకొండవచ్చిన భక్తులు అమ్మవారి ఆలయంను సైతం సందర్శించిపూజా కార్యక్రమాలు నిర్వహిస్తుంటారు. అయితే ప్రస్తుతం దర్శనానికి వెళ్లే భక్తులు పలు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు.ఆలయంకు వెళ్లే మార్గమధ్యంలోని మెట్లదారి ఇబ్బంది కలిగిస్తుంది.కొంతదూరం వరకు రానూ పోనూ ఒకటే మెట్లదారి.అక్కడ నుంచి కొండ పగుళ్లలో గల మెట్లదారిన అమ్మవారి ఆలయం చేరుకుంటారు.క్యూలో దర్శనానికి వెళ్లే భక్తులుకు,దర్శనం చేసుకొని తిరిగి వచ్చే భక్తులు ఎదురవుతున్నారు.దీంతో వందలాది మంది భక్తులు ప్రతిశనివారం రాకపోకలకు ఇబ్బంది పడుతున్నారు.పైగా కోతులు బెడద అధికంగా ఉంటుంది. చేతుల్లో ప్రసాదాలను లాక్కొని పోతుంటాయి.దీనితో భక్తులు అసహనానికి గురవుతున్నారు.ఏళ్లతరబడి ఇబ్బందులు ఎదురవుతున్నాయి.రద్దీ దృష్ట్యా భక్తులకు సహాయంగా గతంలో ఆలయ సిబ్బంది క్యూని క్రమబద్దీకరించేవారు.ఇందులో బాగంగా శనివారం సిబ్బంది కూడా లేరు.దీంతో భక్తులు క్యూలో ఎండకు ఉక్కపోతతో, చెమటతో ఇబ్బంది పడ్డారు.అసహనానికి గురైనారు.పాలకులను,అధికారులను నిందించారు. పరిష్కారం ఎంటంటే.ఈ దారి పక్కనే కొంతఖాళీ స్థలం, బండరాయి ఉంది.దీనిని బాగుచేసి మెట్లదారిని విస్తరించొచ్చు. ఇందుకు పెద్దగా ఆర్థిక, ఆర్థికేతర ఇబ్బందులు ఉండవు.కేవలం అధికారులు దృష్టిసారిస్తే సరిపోతుంది.ఈ సమస్యను కూడా పరిష్కారం చేయడంలో అధికారులు విఫలమవడాన్ని భక్తులు ఆక్షేపిస్తున్నారు.ఫలితంగా భక్తులు ఇబ్బందికి అసౌకర్యానికి, అసహనానికి గురవుతున్నారు.

# ఉగ్రవాదం పై ఉక్కు పాదం మోపాలి





**బిట్రగుంట ఏప్రిల్ 26(ప్రభాతవార్త):** కాశ్మీర్ లోని పెహల్గాం లో ఉగ్రవాదుల దాడిలో మృతి చెందిన బాధిత కుటుంబాలకు మద్దతుగా మండల కేంద్రమైన బోగోలు లో శనివారం సాయంత్రం ముస్లిం మైనార్టీ నాయకులతో కొవ్వొత్తులతో శాంతి ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా షేక్ నూరుద్దీన్, జహీర్ మానవ హక్కుల జిల్లా అధ్యక్షుడు దాసరి సునీల్ మాట్లాడుతూ ఉగ్రవాదాన్ని కూకటి వేళ్ళతో సహా తొలగించాలని కోరారు అంబేద్కర్ విగ్రహం వద్ద నుండి రైల్వే గేట్ వరకు కొవ్వొత్తులతో ర్యాలీ నిర్వహించారు.కేంద్ర ప్రభుత్వం ఉగ్రవాదులపై కఠిన చర్యలు తీసుకోవాలని వారు డిమాండ్ చేశారు ఈ కార్యక్రమంలో హ్యూమన్ రైట్స్ జిల్లా సంయుక్త కార్యదర్శి బత్తుల రవిచంద్ర, ముస్లిం నాయకులు సుభాని, సిరాజ్, గౌస్ బాషా, నిజాముద్దీన్,ఉమర్ తదితరులు పాల్గొన్నారు.

# బుగ్గేశ్వర స్వామి ఆలయంలో వైభవంగా శివపార్వతుల కళ్యాణం



**అకలివలన(రాపూరు),ఏప్రిల్26ప్రభాతవార్త :** మండలంలోని అకిలివలన గ్రామ అటవీ ప్రాంతంలో వున్న మహిమాన్వితమైన బుగ్గేశ్వర స్వామి వారి ఆలయంలో మాస శివరాత్రిని ఎ శనివారం శివపార్వతుల కళ్యాణం వైభవంగా నిర్వహించారు.ఉదయం ఆలయంలో స్వామి వారికి ప్రత్యేకంగా అభిషేకాలు,పూలాంగి సేవ, ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం శివపార్వతుల కళ్యాణాన్ని వేదపండితులు వేదమంత్రోచ్ఛరణల మద్య శాస్త్రోక్తంగా నిర్వహించారు. మధ్యాహ్నం పెద్ద ఎత్తున అన్నదాన కార్యమాన్ని నిర్వహించారు. పెద్ద ఎత్తున భక్తులు ఈ కార్యక్రమంలో పాల్గొని స్వామి,అమ్మవార్లను దర్శించుకోని పూజలు నిర్వహించారు.ఈ కార్యక్రమంలో తెలుగుదేశం పార్టీ తిరుపతి పార్లమెంట్ ఉపాధ్యక్షుడు కొండ్లపూడి రాఘవ రెడ్డి,గౌరి దంపతులు, గ్రామ సర్పంచ్ చెన్ను పెంచల రెడ్డి, పెద్ద ఎత్తున భక్తులు పాల్గొన్నారు.

# పండుగ వాతావరణంలో ఎస్వీఆర్ పార్కును

## చిన్నారులతో కలిసి ప్రారంభించిన మంత్రి నారాయణ



**నెల్లూరు, ఏప్రిల్ 26, ప్రభాతవార్త –వైద్యం :** నగరంలోని 5వ డివిజన్‌లో జాకీర్ హుస్సేన్ నగర్ ప్రాంతంలోని ఎస్వీఆర్ పార్కును శనివారం మంత్రి నారాయణ ప్రారంభించారు. ఈ సందర్భంగా స్థానిక కార్పొరేటర్లు, టీడీపీ ముఖ్య నాయకులు మంత్రికి ఘన స్వాగతం పలికారు. బాణసంచా మోతలతో కోలాట భజనలతో జై నారాయణ నినాదాలతో ఆ ప్రాంతం మార్మోగిపోయింది. అనంతరం చిన్నారుల కేరింతల నడుమ వారితో రిబ్బన్ కట్ చేసి పార్కు ప్రారంభించారు. పార్కులో నూతనంగా ఏర్పాటు చేసిన అధునాతన ఆట పరికరాలను పరిశీలించి చిన్నారులతో సరదాగాఆటలాడారు. పార్కు ఆవరణలో స్థానికులతో కలిసి మొక్కను నాటారు. చిన్నారులకు చాకెట్లు పంచి శుభాకాంక్షలు తెలియజేశారు. అనంతరం ఆయన మీడియాతో మాట్లాడుతూ నగరంలో ఆహ్లాదకర వాతావరణంలో పార్కులను ప్రారంభించడం ఆనందంగా ఉందన్నారు. ఎన్నికల ముందు ఇచ్చిన హామీలను తూచా తప్పకుండా నెరవేరుస్తున్నామన్నారు. గత వైసీపీ ప్రభుత్వ నిర్వాకంతో ఆర్థిక వ్యవస్థ అస్తవ్యస్తంగా మారిందని, ఆర్థిక క్రమశిక్షణ లేక అన్ని వ్యవస్థలు నాశనమమయ్యాయని మండిపడ్డారు. సామాన్యుడు సైతం తనకొచ్చే కొద్దిపాటి మొత్తాన్ని చక్కగా ప్రణాళిక బద్ధంగా ఖర్చు చేస్తారని అయితే జగన్ ప్రభుత్వం ఎలాంటి ఆర్థిక ప్రణాళికలు లేకుండా అస్తవ్యస్తంగా ఖర్చు చేసి రాష్ట్ర ఖజానాను ఖాళీ చేశారన్నారు. ఎన్నికల సమయంలో తాను 84 వేల ఇళ్లకు వెళ్లి వాళ్ల సమస్యలను నా కళ్ళతో చూశానని, నా చెవులతో విన్నానని చెప్పారు. ఎన్నికల ముందు ఇచ్చిన ప్రతి హామీని నెరవేరుస్తానని మంత్రి నారాయణ స్పష్టం చేశారు.

